

కాసుల పంట

అన్నదాతలు ఎంతగానో ఎదురుచూస్తున్న పెట్టుబడి సాయం చేతికందింది. అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్ కింద డబ్బులు ఖాతాల్లో జమవడంతో పండగ వాతావరణం తెచ్చింది. రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు రూ.7 వేలు చెల్లించడంతో రైతుల ఖాతాల్లో కాసులు గలగలలాడాయి. ఖరీఫ్ సమయంలో చేతికి ఎంతోకొంత రావడంతో రైతుల్లో సంబరం నెలకొంది. కూటమి చెప్పినట్టుగానే రైతులకు సాయం అందించి హామీ నిలబెట్టుకుంది.

- అన్నదాత సుఖీభవ రూ.91.10 కోట్ల నిధులు విడుదల
- రాష్ట్ర ప్రభుత్వ వాటా కింద రూ.67.23 కోట్లు
- పీఎం కిసాన్ కింద రూ.23.88 కోట్లు నిధులు విడుదల
- జిల్లాలో 1.34 లక్షల మంది రైతులకు ఆర్థిక లబ్ధి
- కొమానపల్లిలో చెక్కు అందించిన కలెక్టర్ మహేష్‌కుమార్

అమలాపురం, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): అన్నదాతలకు ఖరీఫ్ పెట్టుబడి సాయం కింద కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా అందిస్తున్న అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్‌యోజన పథకం కింద జిల్లాలోని రైతాంగానికి శనివారం నిధులు విడుదలయ్యాయి. ఒక్కొక్క రైతు ఖాతాకు రూ.7వేలు వంతున బ్యాంకు ఖాతాకు డీబీటీ విధానం ద్వారా జమయ్యాయి. కోనసీమ జిల్లాలో ఈ పథకాల కింద మొత్తం రూ.91.10 కోట్లు విడుదల అయ్యాయి. జిల్లాలో 1,34,439 మంది రైతులకు రాష్ట్ర ప్రభుత్వం అందించే రూ.5వేల సహాయం కింద రూ.67.22 కోట్లు, పీఎం కిసాన్ పథకం కింద 1,19,418 మంది రైతులకు రూ.23.88 కోట్లు వెరసి రూ.91.10 కోట్లను అన్నదాతల ఖాతాల్లోకి లాంచనంగా విడుదల చేశారు. ఈ నిధులతో జిల్లాలో ఎస్సీ బీసీలకు చెందిన సుమారు 5వేల మంది అన్నదాతలకు లబ్ధి చేకూరింది. ముమ్మిడివరం మండలం కొమానపల్లిలో శనివారం జిల్లా కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్, ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు చేతుల మీదుగా ఆ నియోజకవర్గానికి చెందిన 23,468మంది రైతులకు రూ.16.42 కోట్ల చెక్కును కార్యక్రమంలో అందజేశారు. అదేవిధంగా అమలాపురం నియోజకవర్గ పరిధిలోని ఉప్పలగుప్తం మండలం గొల్లవిల్లిలో జరిగిన అన్నదాత సుఖీభవ కార్యక్రమంలో రూ.9.24 కోట్ల చెక్కును జాయింట్ కలెక్టర్ నిషాంతి, ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావుల చేతులమీదుగా అందజేశారు. కొత్తపేట నియోజకవర్గంలోని 21 వేల మంది రైతులకు రూ.16.11 కోట్ల చెక్కును ఆలమూరు ఎంపీపీ కార్యాలయం వద్ద జరిగిన కార్యక్రమంలో అందించారు. రాజోలు ఎంపీపీ కార్యాలయం వద్ద జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ 23,293 మంది రైతులకు రూ.16.11 కోట్ల చెక్కును అందించారు. పి.గన్నవరం ఎంపీపీ కార్యాలయంలో ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ 23,727 మంది రైతులకు రూ.16.30 కోట్ల చెక్కును అందజేశారు. మండపేట నియోజకవర్గంలోని ఓ కల్యాణ మండపంలో జరిగిన కార్యక్రమంలో 18,229 మంది రైతులకు రూ.12.49 కోట్ల చెక్కును స్థానిక ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు అందించారు. రామచంద్రపురం నియోజకవర్గంలోని ద్రాక్షారామంలో మార్కెట్ కమిటీ కార్యాలయంలో 24,067 మంది రైతులకు రూ.16.68 కోట్ల చెక్కును ఎమ్మెల్సీ పేరాబత్తుల రాజశేఖరం, మంత్రి సుభాష్ తండ్రి అయిన వాసంశెట్టి సత్యం ఆధ్వర్యంలో పంపిణీ చేశారు. కార్మికమంత్రి సుభాష్ అందుబాటులో లేకపోవడంతో కార్యక్రమాన్ని ఇలా నిర్వహించారు. కాగా అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్‌కు సంబంధించి ఏమైనా రైతులకు సమస్యలు, సందేహాలు ఉంటే ప్రభుత్వం ఏర్పాటుచేసిన టోల్ ఫ్రీ నంబరు 155251కు సంప్రదించాల్సిందిగా సంబంధిత జిల్లా అధికారులు విజ్ఞప్తి చేశారు.



ముమ్మిడివరం మండలం కొమానపల్లిలో రైతులకు అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్ పథకం చెక్కును విడుదల చేస్తున్న కలెక్టర్ మహేష్‌కుమార్, ఎమ్మెల్యే బుచ్చిబాబు

ఇచ్చిన హామీని నిలబెట్టుకుంది



కూటమి ప్రభుత్వం రైతులకు ఇచ్చిన హామీని నిలబెట్టుకుంది. రైతులకు రూ.20 వేలు పెట్టుబడి సాయం అందిస్తామని ఎన్నికల ముందు సూపర్-6 పథకాల్లో చెప్పినట్టుగానే మొదటి విడత రూ.7వేలు సాయం అందించారు. ఖరీఫ్ నాట్లు వేసుకునే రైతులకు ఈ సమయంలో మొదటి విడత జమ చేయడం ఎంతో ఉపయోగం. వ్యవసాయ ఖర్చులకు ఉపయోగపడుతుంది. ప్రభుత్వం వ్యవసాయ రంగానికి ప్రోత్సాహకరంగా ఉంది. యాంత్రీకరణ పరికాలు కూడా రాయితీపై అందిస్తున్నారు. ఇవి రైతులకు ఎంతో ఉపయోగపడతాయి.

- రామదాసు ఆదినారాయణ, రైతు, అనాతవరం, ముమ్మిడివరం మండలం

ఎంతో ప్రయోజనం



అన్నదాత సుఖీభవ అమలు ద్వారా ఆర్థికంగా నాకెంతో ప్రయోజనం కలిగింది. చంద్రబాబు ప్రభుత్వం ఇచ్చిన ఎన్నికల హామీ అలాగే మిగిలిపోతుందనుకున్నాను. కానీ ప్రకటించిన మేరకు ఒక్కసారిగా రూ.7వేలు నా ఖాతాలోకి జమకావడంతో ఖరీఫ్ పెట్టుబడులకు ఇబ్బంది లేదు. రైతులకు ఈ కష్టకాలంలో ఈ పథకం నిధులు ఎంతగానో చేయూతనిస్తాయి.

- సలాది చంద్రరావు, చీకట్లపాలెం, ఉప్పలగుప్తం మండలం

ఎంతో మేలు



ఖరీఫ్ నాట్లు వేసే సమయంలో పెట్టుబడులకు ఇబ్బంది పడుతున్నా. అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్ సొమ్ములు అందించి ఎంతో మేలు చేశారు. ఈ పథకం మాలాంటి అన్నదాతలకు ఊపిరిపోస్తుంది. ప్రభుత్వానికి రైతు సంక్షేమం పట్ల ఎంత ఆసక్తి ఉందో ఈ పథకం అమలు తీరే నిదర్శనం.

- పాటి చినసత్యనారాయణ, వాడపర్రు, ఉప్పలగుప్తం మండలం



నిందితుడు హర్షవర్ధన్.. తండ్రిని హతమార్చేందుకు వినియోగించిన కారు

కొడుకు.. కుట్ర!

బీమా కోసం.. మానవత్వాన్ని మంటకలిపి
కన్నతండ్రిపై కొడుకు హత్యాయత్నం
ప్రాణాలతో బయటపడ్డ తండ్రి
కటకటాలపాలైన కొడుకు

7



కలిసిరాని శ్రావణం

నేలచూపులు చూస్తున్న కర్పూర అరటి
గతేడాది కంటే దిగజారిన ధరలు
గెల రూ.100 నుంచి రూ.350లోపే
రైతుల లబోదిబో

7

జిల్లాలో రూ.50 కోట్లతో 216ఏ రహదారి అభివృద్ధికి శ్రీకారం

కేంద్రమంత్రి నితిన్‌గడ్కరీ, సీఎం చంద్రబాబుతో కలిసి వర్చువల్‌గా మంగళగిరిలో శంకుస్థాపన

అమలాపురం, ఆగస్టు2(ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా పరిధిలో జాతీయ రహదారుల్లో సర్వీసు రోడ్లు, వివిధ జంక్షన్ల అభివృద్ధి కోసం కేంద్ర ఉపరితల రవాణాశాఖ మంత్రి నితిన్ గడ్కరీ రూ.50 కోట్లను కేటాయించారు. దీనిలో భాగంగా ఈ పనులకు శనివారం కేంద్ర ఉపరితల రవాణామంత్రి నితిన్‌గడ్కరీ ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుతో కలిసి మంగళగిరిలోని సీకే కన్వెన్షన్ హాలు నుంచి వర్చువల్‌గా పనులకు శ్రీకారం చుట్టారు. ఈ నిధులతో జిల్లా పరిధిలోని వివిధ ప్రాంతాల్లో సర్వీసు రోడ్లు, కల్వర్టర్లు, జంక్షన్ల అభివద్ధికి చర్యలు తీసుకోనున్నారు. దీనిలో భాగంగా 216ఏ జాతీయ రహదారిలో ఆలమూరు మండలం మడికి, చెముడులంక, చొప్పెల్ల, ప్రభుత్వ కళాశాల, రావులపాలెం వరకు రహదారి అభివృద్ధితోపాటు సిద్ధాంతం, దివాన్‌చెరువు సెక్షన్‌లలో పాత టోల్‌ప్లాజా, సిద్ధాంతంలోని కమ్మకల్యాణ మండపం, గుండుగొలను జంక్షన్ వరకు రహదారి అభివృద్ధిలో భాగంగా సుమారు 6 కిలోమీటర్లు రోడ్డు అభివృద్ధి కోసం రూ.50 కోట్లు నిధులు విడుదల చేసింది. దీనిలో భాగంగా 6.06 కిలోమీటర్ల సర్వీసు రోడ్లు, 9 బాక్సు కల్వర్టర్లు, 3 పైపులైను కల్వర్టర్లు, మేజర్ జంక్షన్ 1 అభివృద్ధి చేయనున్నారు. వీటి అభివృద్ధి ద్వారా ఆ రహదారిపై ఐదు చోట్ల ప్రమాదాలు జరిగే బ్లాక్ స్పాట్‌ల నుంచి విముక్తి లభిస్తుంది. అలాగే ఈ సర్వీసు రోడ్ల వల్ల రోడ్డు భద్రతతో పాటు స్కూలు పిల్లలకు, ఇతరులకు సర్వీసు రోడ్ల నుంచి వెళ్లే మార్గం సుగమం కావడం వల్ల ప్రమాదాల నివారణకు ఇది తోడ్పాటు అందిస్తుందని భావిస్తున్నారు. ఈ నిధులతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా అభివృద్ధి పనులుచేపడితే రావులపాలెం జంక్షన్‌తో సహా పలు ప్రాంతాల్లో ప్రమాదాల నివారణకు మార్గం సుగమం అవుతుంది.

ఆదివారం ప్రత్యేకం

ఒక ఊరు.. నూరు లాడ్జిలు!

పిఠాపురాన ప్రతి ఇల్లూ వసతిగృహమే



ఆ ఆలయానికి వెళితే వసతికి వెతుక్కోవాల్సిన పనే ఉండదు.. ఆలయం ఎదుట నిలబడి ఎటు చూసినా రూమ్స్ అద్దెకు ఇవ్వబడును అంటూ బోర్డులు దర్శనమిస్తాయి.. ఎందుకంటే అక్కడ ప్రతి ఇల్లూ ఒక అతిథి గృహమే.. ఈ నేపథ్యంలో ఏ ఇంటి తలుపు తట్టినా అతిథిదేవోభవ అంటూ ఆహ్వానిస్తారు.. అదిరే సౌకర్యాలతో ఆతిథ్యం ఇస్తారు.. ఫ్రీగా అనుకునేరు.. అంతా డబ్బులకే.. ఇదెక్కడో కాదండోయ్.. పిఠాపురంలోని శ్రీపాద శ్రీవల్లభుడి ఆలయం చుట్టూ ఉన్న పరిస్థితి.. ఒక 100 వరకూ లాడ్జిలు ఉన్నాయంటే అతిశయోక్తి కాదేమో.. ఇక్కడ కాశీ తరహాలో వసతి సదుపాయాలు ఉంటాయి..

- ఏ వీధిలో చూసినా గెస్ట్‌రూమ్‌లు
- లాడ్జిలుగా మారుతున్న నివాసాలు
- ఏ ఇంటికెళ్లినా అద్దెకు రూమ్స్
- శ్రీ పాదుడి ఆలయం వద్ద డిమాండ్
- ఇప్పటికే 100 లాడ్జిలు నిర్వహణ
- నిర్మాణంలో మరో 150
- రోజురోజుకు పెరుగుతున్న భక్తులు
- 1500 మందికి ఉపాధి

(ఆంధ్రజ్యోతి-పిఠాపురం)

అక్కడ ప్రతి ఇల్లు ఒక వసతి గృహమే. వీధులు, సందులు ఎక్కడ చూసినా 'రూమ్‌లు అద్దెకు ఇవ్వబడును' అంటూ ఇంగ్లీషు, హిందీ, మరాఠీ భాషల్లో బోర్డులు కనిపిస్తాయి. శ్రీపాదుడి ఆలయానికి చుట్టూ 200 మీటర్ల పరిధిలో ఇప్పటికే 100కిపైగా లాడ్జిలు ఉన్నాయి. మరో 50 వరకూ నిర్మాణంలో ఉన్నాయి. భక్తులకు గదులు అద్దెకు ఇవ్వడం ద్వారా పలువురు ఉపాధి పొందుతున్నారు.కాశీ తరహాలో ఒక ఆలయం చుట్టూ ఇన్ని వసతి సముదాయాలు ఉన్న పరిస్థితి గోదావరి జిల్లాల్లో ఎక్కడా కానరాదు.

శ్రీపాదశ్రీవల్లభుడి భక్తుల రాక..

మరాఠీలు, ఉత్తరాది రాష్ట్రాలు వారు తమ ఇంటి ఇలవేల్పుగా దత్తాత్రేయస్వామి ప్రథమ అవతారమైన శ్రీపాదశ్రీవల్లభుడిని భావిస్తారు. ఈ మేరకు ఆయన జన్మించిన పిఠాపురం పట్టణంలోని శ్రీపాదశ్రీవల్లభ మహాసంస్థానానికి ఏటా 20 లక్షల మంది భక్తులు వస్తుంటారు. మహారాష్ట్రతో పాటు కర్నాటక, ఉభయ తెలుగు రాష్ట్రాలు, ఉత్తరాది నుంచి భక్తులు ఇక్కడకు వచ్చి శ్రీపాద శ్రీవల్లభుడిని దర్శించుకుంటారు. ఏటా గురువారాలు, చిత్తనక్షత్రం వచ్చే రోజులతో పాటు శ్రీపాద శ్రీవల్లభ జయంతి సప్తాహ మహోత్సవాలు, దత్త జయంతి ఉత్సవాలు, విజయదశమి, ఇతర పర్వదినాల సమయాల్లో భక్తుల రద్దీ అధికంగా ఉంటుంది.ఈ ఆలయానికి వచ్చే భక్తులు కనిష్ఠంగా మూ డు రోజులు, గరిష్ఠంగా తొమ్మిది రోజులు ఉంటారు. కొందరు ఏటా నెల రోజుల పాటు ఉండి శ్రీపాదశ్రీవల్లభ చరిత్ర, గురుచరిత్ర పారాయణ చేసుకుంటారు.

ఇక్కడ కొబ్బరికాయ కొట్టరు..


శ్రీపాదశ్రీవల్లభుడికి కొబ్బరికాయ కొట్టరు. శ్రీపాదుడు కొలువై ఉన్న ఆలయ ప్రాంగణంలోని ఔదంబర వృక్షానికి కొబ్బరికాయలను కట్టి వేలాడతీసి చుట్టూ ప్రదిక్షణలు చేసి కోర్కెలు నెరవేర్చమని వేడుకుంటారు.కోర్కెలు నెరవేరిన తర్వాత మళ్లీ శ్రీపా దశ్రీవల్లభుడిని దర్శించుకుని పూజలు చేస్తారు.

భక్తనివాసాలుగా..

భక్తుల రద్దీ దృష్ట్యా నివాస గృహాలు లాడ్జిలు, భక్తనివాస్‌లు, వసతి సముదాయాలుగా మారిపోయాయి. ఆలయ వసతి సముదాయాల్లో 70 గదులు ఉన్నాయి. ఇవి పూర్తిగా ఉచితమైనా భక్తుల అవసరాలను తీర్చలేకపోతున్నాయి. ఇప్పుడు ఈ క్షేత్రం చుట్టూ 200 మీటర్ల పరిధిలో 100కిపైగా లాడ్జిలు ఉన్నాయి. ఇవి గాక పట్టణంలోని వివిధ ప్రాంతాల్లో 15 వరకూ ఉన్నా పర్వదినాల సమయాల్లో రూమ్‌లు సరిపోని పరిస్థితి. సాధారణ రోజుల్లో 12 గంటలకు రూ.వెయ్యి, 24 గంటలకు రూ.1500 నుంచి రూ.2,500 వరకూ అద్దెగా వసూలు చేస్తున్నారు. పర్వదినాల సమయంలో మాత్రం 12 గంటల ప్రాతిపదికన అద్దె రూ.2 వేల నుంచి రూ.4 వేల వరకూ ఉంటోంది. భక్తులు వసతిని ఆలయ పరిసరాల్లో ఉన్న గృహాల యజమానులు తమ ఆదాయ వనరుగా మార్చుకున్నారు. పలువురు గృహాల యజమానులు వసతి తీసుకునే భక్తులకు ఇష్టమైన ఆహారాన్ని తయారు చేసి అందిస్తున్నారు. ఆహారంతో కలిసి అద్దెలు వసూలు చేస్తారు.

ఇరుకుగా వీధులు..

ఆలయ పరిసరాల్లో రోడ్లు ఇరుగ్గా ఉంటాయి. ఒక కారు వెళ్తే మరో వాహనం వచ్చేందుకు మార్గం ఉండదు. అటువంటి చోట 100కిపైగా లాడ్జిలు, వసతి సముదాయాలను నిర్మించారు. కొన్ని సందుల్లోకి ద్విచక్ర వాహనాలు మినహా ఆటోలు వెళ్లలేవు. కాశీ తరహాలో ఇక్కడ వీధులు కనిపిస్తాయి. అటువంటి వాతావరణం ఉభయ గోదావరి జిల్లాలోని పిఠాపురంలోని శ్రీపాదశ్రీవల్లభ మహాసంస్థానం వద్ద కనిపిస్తోంది. దీనివల్ల ప్రత్యక్షంగా, పరోక్షంగా 1500 మందికి పైగా ఉపాధి కలుగుతోందని పలువురు తెలిపారు. ఇక్కడ వసతిగృహాలు, లాడ్జిలకు ఉన్న డిమాండ్‌తో స్థలాల రేట్లు గణనీయంగా పెరిగాయి. ఇక్కడ సెంటు స్థలం ప్రస్తుతం రూ.30 లక్షల నుంచి రూ.50 లక్షల వరకూ ఉంది.కొందరు సినీ ప్రముఖులు ఇక్కడ స్థలాలు కొనుగోలు చేశారు. వారు కొంత పెద్దస్థాయిలో హోటళ్లు నిర్మించాలని భావిస్తున్నట్టు సమాచారం.




భక్తులకు వసతి.. ఎందరికో ఉపాధి



శ్రీపాదశ్రీవల్లభ మహాసంస్థానానికి భక్తులు అధికంగా తరలివస్తున్నారు. భక్తులకు ఇబ్బంది లేకుండా ఆలయ పరిసరాల్లో గృహ యజమానులు తమ ఇళ్లనే వసతి సముదాయాలుగా మార్చి అద్దెకు ఇస్తున్నారు. భక్తులకు దగ్గరలో వసతి లభిస్తోంది.

- పెనుగొండ కొండలరావు, విశ్రాంత సాంఘిక సంక్షేమ శాఖాధికారి, పిఠాపురం

టెంపుల్ సిటీగా అభివృద్ధి చేయాలి



పిఠాపురంను టెంపుల్ సిటీగా అభివృద్ధి చేస్తే భక్తులకు మెరుగైన సౌకర్యాలు,వసతి లభిస్తాయి. ప్రభుత్వం పర్యాటకాభివృద్ధిలో భాగంగా హౌస్ స్టే కల్పిస్తున్న గృహ యజమానులను ప్రోత్సాహించాలి. డిప్యూటీ సీఎం పవన్ చొరవ చూపాలి.

- తోట ఏడుకొండలు, విశ్రాంత అర్బన్ బ్యాంకు ఉద్యోగి, పిఠాపురం



కలెక్టరేట్ పరిపాలనాధికారికి వినతిపత్రం అందజేస్తున్న ఫ్యాప్టో జిల్లా నాయకులు

12వ వేతన సవరణ సంఘాన్ని తక్షణం ఏర్పాటు చేయాలి

హామీల అమలుకు ఫ్యాప్టో ధర్నా

అమలాపురం టౌన్, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): పదకొండవ పీఆర్సీ గడువు ముగిసి రెండేళ్లు పూర్తయినా 12వ వేతన సవరణ సంఘాన్ని ఏర్పాటుచేయకపోవడం ఆందోళనకరమని ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య (ఫ్యాప్టో) రాష్ట్ర ఛైర్మన్ లంకలపల్లి సాయిశ్రీనివాస్ అన్నారు. 12వ పీఆర్సీని తక్షణం ఏర్పాటుచేయాలని డిమాండ్ చేశారు. ఉద్యోగ, ఉపాధ్యాయులకు వెంటనే 30శాతం మధ్యంతర భృతి ప్రకటించాలన్నారు. ఫ్యాప్టో జిల్లా శాఖ ఆధ్వర్యంలో శనివారం అమలాపురం నల్లవంతెన దిగువన ధర్నాచౌక్‌లో ఉద్యోగ, ఉపాధ్యాయులు, కార్మిక సంఘాల నాయకులతో ధర్నా నిర్వహించారు. ధర్నా శిబిరాన్ని ఫ్యాప్టో ఛైర్మన్ సాయిశ్రీనివాస్‌తోపాటు ఉభయగోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ బొర్రా గోపిరాజు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఉపాధ్యాయ బదిలీలు జరిగి 45 రోజులు గడిచినా జీతాలు చెల్లించలేని పరిస్థితి దారుణమన్నారు. కనీసం బదిలీ అయిన పాఠశాలల్లో చేరే పరిస్థితి కూడా లేకుండా పోయిందన్నారు. ఏకీకృత సర్వీస్ రూల్స్ సమస్యను పరిష్కరించాలని కోరినా ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. సీపీఎస్‌ను రద్దుచేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. వామపక్ష జిల్లా నేతలు కొప్పుల సత్తిబాబు, కారెం వెంకటేశ్వరరావులతోపాటు ఫ్యాప్టో జిల్లాశాఖ ఛైర్మన్ ఎంటీవీఎఎస్ సుబ్బారావు, ప్రధాన కార్యదర్శి పీవీఎస్ రామారావు, డిప్యూటీ సెక్రటరీ జనరల్స్ సరిదే సత్యపల్లంరాజు, పి.వెంకటేశ్వరరావు, ఎస్ఎన్ మునేశ్వరరావు, కార్యదర్శులు షబ్బీర్‌హుస్సేన్, జీవీవీ సత్యనారాయణ, కె.రామచంద్ర మాట్లాడారు. అనంతరం కలెక్టరేట్‌లో పరిపాలనాధికారి కడలి కాశీవిశ్వేశ్వరరావుకు వినతిపత్రం అందించారు.



పాఠశాలల్లోకి 'రాజకీయాల'కు నో ఎంట్రీ

- కీలక ఉత్తర్వులు జారీ చేసిన స్కూలు ఎడ్యుకేషన్ డైరెక్టర్
- తల్లిదండ్రులు, ఎస్ఎంసీ కమిటీకి మాత్రమే అనుమతి
- ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రుల హర్షం
- ఫ్లెక్సీలు, రాజకీయ పార్టీల చిహ్నాలకు పాఠశాలల్లో నిషేధం

(అమలాపురం-ఆంధ్రజ్యోతి)

ప్రశాంత పరిస్థితుల నడుమ విద్యాబుద్ధులు నేర్చుకుంటున్న విద్యార్థులకు భవిష్యత్తులో ఎటువంటి అసౌకర్యం కలుగకుండా ఉండేందుకు రాష్ట్ర ప్రభుత్వం పాఠశాలల్లో రాజకీయ పార్టీలపై నిషేధం విధిస్తూ కీలక నిర్ణయం తీసుకుంది. దాంతో ఇటీవల జిల్లావ్యాప్తంగా ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, గురుకుల పాఠశాలల్లో తరచూ రాజకీయ పార్టీల నాయకులు తనిఖీల పేరుతో ఆయా ప్రాంగణాల్లోకి ప్రవేశించి ఉపాధ్యాయులను బెదిరించడం, సిబ్బందిని ఇబ్బంది పెట్టడం వంటి చర్యలు చేస్తున్నట్టు రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి వచ్చింది. దాంతో స్పందించిన డైరెక్టర్ స్కూలు ఎడ్యుకేషన్ వి.విజయ్‌కుమార్‌రాజు ఆర్సీ నంబరు 30/67/2025 పేరుతో శుక్రవారం కీలక ఉత్తర్వులు వెలువరించారు. ఇకపై పాఠశాలల్లో రాజకీయాలు నో ఎంట్రీ అంటూ ఇచ్చిన ఉత్తర్వులపై ఇటు ఉపాధ్యాయులు, అటు ఉపాధ్యాయులు హర్షాతిరేకాలు వ్యక్తంచేస్తున్నారు. ప్రభుత్వానికి అందిన ఫిర్యాదులను దృష్టిలో పెట్టుకుని ఈ ఉత్తర్వులు వెలువరించారు. ముఖ్యంగా పాఠశాల ఆవరణలో రాజకీయ పార్టీలు లేదా సంస్థలకు సంబంధించిన జెండాలు, ఫ్లెక్సీలు, బ్యానర్లు లేదా పోస్టర్ల వంటివి ఏమైనా రాజకీయ చిహ్నాలు గానీ, సామాగ్రిని గానీ ప్రదర్శించడం ఖచ్చితంగా నిషేధిస్తూ ఉత్తర్వులిచ్చారు. పాఠశాల విద్యార్థుల తల్లిదండ్రులు, ఎస్ఎంసీ సభ్యులు తప్ప మరే ఇతర అనధికార వ్యక్తులను పాఠశాలలోకి అనుమతి లేదంటూ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఈ మేరకు రాష్ట్రంలోని అన్ని ప్రాంతీయ పాఠశాలల విద్యా జాయింట్ డైరెక్టర్లు, జిల్లా విద్యాశాఖాధికారులకు ఈ ఉత్తర్వులు అందించారు. ఆయా పాఠశాలల్లో హెచ్ఎంలు లేదా ప్రిన్సిపాల్‌అనుమతి లేకుండా అనధికార వ్యక్తులు, సమూహాలు పాఠశాలల్లోకి ప్రవేశించినట్టు తెలిస్తే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశాలిచ్చారు. అలాగే ఆయా పాఠశాలలకు బహుమతులు లేదా విరాళాలు ఇచ్చే దాతలు అనధికారిక ప్రవేశాన్ని కూడా రద్దుచేశారు. ఎందుచేత అంటే కొనసాగుతున్న విద్యా కార్యకలాపాలకు ఈ పరిస్థితులు అవరోధంగా మారుతున్న దృష్ట్యా ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుందని ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. విద్యార్థుల తల్లిదండ్రులు, ఎస్ఎంసీ కమిటీ సభ్యులు తప్ప మరెవరికీ అనుమతి లేదు. దాతలు వస్తు, నగదు, సామగ్రి రూపంలో ఇవ్వాలనుకుంటే పిల్లలతో సంభాషించకుండా హెచ్ఎంల వద్దకు వెళ్లి వారికి అందించాలి. అలాగే పిల్లలకు వాటిని అందిస్తున్నట్టు ఫొటోలు తీయడమూ ఖచ్చితంగా నిషేధించారు. ఆయా పాఠశాలల్లో వచ్చే ఫిర్యాదులు, అభ్యర్థనలు పరిపాలనా కార్యాలయానికి మాత్రమే సమర్పించాలని, ఫిర్యాదుల కోసం సిబ్బంది, విద్యార్థుల బాహ్య వ్యక్తులు లేదా సంస్థలతో నేరుగా పాల్గొనకూడదని ఆ ఉత్తర్వుల్లో ఆంక్షలు విధించారు. ఈ ఉత్తర్వులను ఖచ్చితంగా అన్ని పాఠశాలల్లో అమలుచేయాలని ప్రభుత్వం ఆదేశాలు ఇవ్వడంతో ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు హర్షాతిరేకాలు వ్యక్తంచేస్తున్నారు. ఇటీవల రాజకీయ పార్టీల ముసుగులో మెడల్లో కండువాలు వేసుకుని పాఠశాలల్లోకి వెళ్లి మధ్యాహ్నం భోజనపథకం తనిఖీలు, రికార్డులు తనిఖీలు చేయడం వంటివి తగ్గుతాయి. పరోక్షంగా విద్యార్థి సంఘాలకు వర్తించే అవకాశం ఉంది.



అమలాపురం ధర్నాచౌక్‌లో ఫ్యాప్టో ఆధ్వర్యంలో ధర్నాలో పాల్గొన్న ఉద్యోగులు, ఉపాధ్యాయులు

ఇంటర్‌లో చేరేందుకు 11 వరకు గడువు పెంపు

అమలాపురం టౌన్, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరంలో చేరే విద్యార్థులకు ఈనెల 11 వరకు మరోసారి గడువును పొడిగించినట్లు జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి వనుము సోమశేఖరరావు తెలిపారు. జనరల్, ఒకేషనల్ ఇంటర్మీడియట్‌లో చేరే విద్యార్థులకు గడిచిన జూలై 31తో ముందుగా ఇచ్చిన గడువు ముగిసిందన్నారు. విద్యార్థులకు విద్యా సంవత్సరం వృథా కాకుండా ఉండేందుకు మరోసారి గడువును పొడిగించినందున ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.



(కాకినాడ-ఆంధ్రజ్యోతి)

వాహనయోగమే!

● దివ్యాంగుల కోసం మరో పథకం
● అర్హులకు రెట్రోఫిటెడ్ వాహనాలు అందజేయనున్న రాష్ట్ర ప్రభుత్వం
● త్వరలో దరఖాస్తుల స్వీకరణ ప్రారంభించే అవకాశం

దివ్యాంగులకు కూటమి సర్కారు తీపి కబురు చెప్పనుంది. ఇప్పటికే ఇంధన రాయితీ, శాశ్వత గుర్తింపు కార్డులు అందజేసిన సర్కారు ఈసారి నూరుశాతం రాయితీతో మూడు చక్రాల వాహనాలు(రెట్రోఫిటెడ్ వాహనాలు) అందించేందుకు సిద్ధమవుతోంది. దీనికి సంబంధించిన దరఖాస్తుల స్వీకరణ త్వరలోనే ప్రారంభం కానుంది. అర్హుల జాబితాను తయారు చేసి త్వరితగతిన వాహనాలు అందజేసేందుకు ఇంధన రాయితీ కల్పించిన ప్రభుత్వం మరోసారి రూ.లక్ష విలువైన వాహనాలను ఉచితంగా అందజేస్తారని ప్రకటన వెలువడడంతో దివ్యాంగులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

వైసీపీ హయాంలో నిరక్ష్యం

టీడీపీ ప్రభుత్వం 2014-19 మధ్యకాలంలో రెట్రోఫిటెడ్ వాహనాలను అందజేసింది. వైసీపీ ప్రభుత్వం దీన్ని పూర్తిగా నిరక్ష్యం చేసింది. ఐదేళ్ల కాలంలో ఒక్కసారే పంపిణీ చేశారు. దీంతో ఎంతోమంది దివ్యాంగులకు ఈ వాహనయోగం కలగలేదు. ఎక్కడికైనా వెళ్లాలంటే వ్యయప్రయాసలు పడాల్సి వచ్చేది. ఎవరొకరిపై ఆధారపడాల్సి వచ్చేది. ఎన్నికల హామీలో భాగంగా సీఎం చంద్రబాబు పెన్షన్ పెంచడం, ఆ తర్వాత ఇంధన రాయితీ, ఇప్పుడు రూ.లక్ష విలువ చేసే వాహనాలనుఅందించాలనుకోవడం ఆనందంగా ఉందని దివ్యాంగులు చెబుతున్నారు. తమ పనులు తాము చేసుకునే అవకాశం ఉంటుందని అంటున్నారు.

ఇలా చేయాలి

దివ్యాంగులు ఈవాహనాలు పొందాలంటే ఇలా దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తుతోపాటు వైకల్యం 70శాతం నిర్ధారించే సదరం సర్టిఫికెట్, డ్రైవింగ్ లైసెన్స్, పదోతరగతి సర్టిఫికెట్, బ్యాంక్ వివరాలు, ఆధార్, రేషన్‌కార్డులు, వ్యాపారం లేదా ఏదైనా సంస్థలో పనిచేస్తున్నట్టు ధ్రువీకరణ పత్రంతో జిల్లాలోని వయోవృద్ధులు,విభిన్న ప్రతిభావంతులశాఖ కార్యాలయంలో అందజేయాలి.

అర్హతలు ఇవీ

మూడు చక్రాలవాహనాల పంపిణీకి దివ్యాంగులకుగల అర్హతలను ఇప్పటికే ప్రభుత్వం నిర్ధారించింది. డిగ్రీ ఆపై ఉన్న విద్యనభ్యసించే విద్యార్థులకు, స్వయం ఉపాధి రంగంలో ఉన్నవారికి తొలి ప్రాధాన్యం ఇస్తారు. 18-45 ఏళ్ల మధ్య వయస్సు ఉండి, 70శాతం అంతకంటే ఎక్కువ వైకల్యం ఉన్న వారు దీనికి అర్హులు అని అధికారులు చెబుతున్నారు.

నియోజకవర్గానికి పదేసి వాహనాలు

తొలి దశలో నియోజకవర్గానికి పది చొప్పున వాహనాలు అందజేసే దిశగా కూటమి ప్రభుత్వం చర్యలు చేపడుతోంది. ఏటా ఇలా మరికొందరి దివ్యాంగులకు ఈ వాహనాలు అందించేలా ఏర్పాట్లు చేస్తోంది. స్వచ్ఛంద సంస్థల ద్వారా మరికొంతమందికి వీటిని అందించేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నారు. దీంతో ప్రతి లబ్ధిదారుడికి వాహనం అందుతుందని అధికారులు చెప్తున్నారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో 2లక్షలమంది దివ్యాంగులు ఉన్నారు. గతంలో నియోజకవర్గానికి పదేసి చొప్పున ఇచ్చినట్టుగానే ఈసారి కూడా అందజేయనున్నారు.

త్వరలోనే వాహనాలు అందజేస్తాం

ప్రభుత్వ ఆదేశాలు అందగానే దరఖాస్తుల స్వీకరణ ప్రారంభిస్తాం. కూటమి ప్రభుత్వం అందజేయనున్న ఈ వాహనాల కోసం అర్హులు దరఖాస్తు చేసుకోవాలి. ఈపథకాన్ని సద్వినియో గం చేసుకోవాలి. అర్హుల ఎంపిక పూర్తయ్యాక వీలైనంత త్వరలోనే వాహనాలను అందజేస్తాం.

-ఏ.వై.శ్రీనివాస్, దివ్యాంగుల సంక్షేమ శాఖ, ఏడీ, కాకినాడ జిల్లా



హిమాచల్‌ప్రదేశ్-తమిళనాడు మధ్య జరుగుతున్న పోటీ

ఉల్లాసంగా...

● రెండోరోజు జాతీయ మహిళా జూనియర్ హాకీ పోటీలు



బాల్‌కోసం పోరాడుతున్న క్రీడాకారులు

కార్పొరేషన్(కాకినాడ), ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): హాకీ ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యం లో కాకినాడ జిల్లా క్రీడామైదానంలో జరుగుతున్న 15వ జాతీయ జూనియర్ మహిళా హాకీ పోటీలు రెండోరోజు శనివారం ఉల్లాసంగా జరిగాయి. లీగ్ కమ్ నాకౌట్ దశలో జరుగుతున్న ఈ పోటీలలో గోయన్స్ దద్రానగర్ హవేలి, డామన్ డయ్యు మధ్య జరిగిన మ్యాచ్లో 4-0 స్కోర్‌తో గోయన్స్ హాకీ జట్టు, మిజోరాం, గుజరాత్ మధ్య జరిగిన మ్యాచ్లో మిజోరాం 9-0 స్కోర్ తోను రాజస్థాన్, తెలంగాణ మధ్య జరిగిన మ్యాచ్‌లో రాజస్థాన్ 6-1 స్కోర్‌తో విజయం సాధించాయి. కేరళ, పాం డుచ్చేరి మధ్య జరిగిన మ్యాచ్‌ల్లో కేరళ 4-2 స్కోర్‌తో గెలుపొందింది. హిమాచల్‌ప్రదేశ్, తమిళనాడు మధ్య జరిగిన మ్యాచ్ డ్రాగా ముగిసింది. ఢిల్లీ, అరుణాచల్‌ప్రదేశ్ మధ్య జరిగిన మ్యాచ్లో ఢిల్లీ 4-2 స్కోర్‌తో గెలుపొందింది. శనివారం నిర్వహించిన మ్యాచ్‌లో సీనియర్ పీఈటీ బంగ్రా రాజు క్రీడాకారులను పరిచయం చేసుకుని ప్రారంభించారు. మ్యాచ్‌లను రాష్ట్ర హాకీ సంఘ అధ్యక్షుడు బి.చాణిక్య రాజు, కార్యదర్శి హర్షవర్ధన్, సంయుక్త కార్యదర్శి వి.రవిరాజు, కోశాధికారి పి.థామస్ పీటర్, ఉపాధ్యాక్షుడు సూర్యప్రకాష్, భవాని శంకర్, సుధీర్ పోటీలను పర్యవేక్షించారు.



హోరాహోరీగా జరుగుతున్న పోటీలు

శాకాహారుల పులస

ఆగాకరకాయ కిలో రూ. 200



సామర్లకోట, ఆగస్టు2 (ఆంధ్రజ్యోతి): ఆషాడం, శ్రావణమాసాలలో లభించే ఆగాకర కాయల కూర రుచి ఒక్కసారైనా చూడాలని పలువురు తహతహలాడుతుంటారు. వీటి ధర చూసి సామాన్యులే కాదు, ధనికులు సైతం అమ్మో అని వెనుకంజ వేస్తుండడం గమనార్హం. వీటి ధర కిలో రూ.180 నుంచి రూ.200 వరకూ పలుకుతుంది. ఏడాదిలో కేవలం రెండు నెలలు మాత్రమే పండే ఆగాకరకాయలు మార్కెట్‌లో అందరినీ ఆకర్షిస్తున్నాయి. సామర్లకోట, పెద్దాపురం మార్కెట్లకు గత రెండు రోజులుగా ఆగాకరకాయలు పెద్దనిమ్మకాయల పరిమాణంలో లభిస్తున్నాయి. సాధారణంగా ఈ పంట ఏజెన్సీ ప్రాంతాలలోనూ పశ్చిమగోదావరి, కృష్ణా జిల్లాల్లోనూ విరివిగా పండుతాయని అయితే అధిక వర్షాల కారణంగా దిగుమతులు అంతంతమాత్రంగానే ఉండడంతో సహజంగానే ఆగాకరకాయలకు గిరాకీ పెరిగింది. నెలా పదిహేను రోజుల పాటు వ్యాపారులు వీటిని మార్కెట్లలో విక్రయిస్తూ లాభాలను ఆర్జిస్తుంటారు. ఆగాకరకాయలు యాంటీ ఇన్‌ఫ్లమేటరీ, యాంటీ మైక్రోబయల్ గుణాలు కలిగి ఉంటాయి. వీటితో ఇన్ఫెక్షన్లు, దగ్గు, జలుబులు, చెవినొప్పి నుంచి ఉపశమనం కలుగుతుంది. కంటితోపాటు పక్షవాతం, వాపు లాంటి అనారోగ్య సమస్యలను నివారిస్తాయి. శిశువు ఎదుగుదలకు ఇది ఉపయుక్తంగా ఉంటుంది. గర్భిణీలకు మంచి ఫుడ్. కనీసం వారానికి రెండు సార్లు తింటే మంచిదని వైద్యనిపుణురాలు డాక్టర్ ప్రవీణ తెలిపారు. మరో నెలరోజులపాటు ఆగాకరకాయలు మార్కెట్లకు వస్తాయని అందుకే వీటికి ఈ ధర ఉందని మార్కెట్ వ్యాపారులు చెబుతున్నారు.



శ్రీనివాసరావును సత్కరిస్తున్న మాజీ వీసీలు ప్రసాదరాజు, మురళీకృష్ణ

ముగిసిన ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం

జేఎన్టీయూకే, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): వర్శిటీలో ఈసీఈ విభాగం ఆధ్వర్యంలో లెవరేజింగ్ అవుట్‌కమ్ బేస్డ్ ఎడ్యుకేషన్ ఫర్ కంటిన్యూస్ క్వాలిటీ ఇంప్రూవ్‌మెంట్ ఇన్ ఇంజనీరింగ్ ఎడ్యుకేషన్ అనే అంశంపై వారం రోజులపాటు నుంచి నిర్వహిస్తున్న ఫ్యాకల్టీ డవలప్‌మెంట్ ప్రోగ్రాం శనివారం ముగిసింది. ముఖ్యఅతిథిగా పాల్గొన్న న్యూఢిల్లీలోని ఎన్ఐఈపీఏ ప్రొఫెసర్ ఎన్.శ్రీనివాసరావు మాట్లాడుతూ ఇంజనీరింగ్ విద్యలో నాణ్యతను పెంచేందుకు అవుట్‌కమ్ బేస్డ్ ఎడ్యుకేషన్ ఒక కీలక మా ర్గం అన్నారు. అధ్యాపకులు తమ బోధనా విధానాలను నిరంతరం మెరుగుపరుచుకోవడమే విద్యార్థుల అభివృద్ధికి దారితీస్తుందన్నారు. ఈసందర్భంగా ముఖ్యఅతిథిని మాజీ వీసీలు జీవీఆర్ ప్రసాదరాజు, కేవీఎస్‌జీ మురళీకృష్ణ, పద్మరాజు, వైస్ ప్రిన్సిపాల్స్ దీక్షితులు, స్వరూపారాణి, డైరెకర్లు బాలాజీ, కృష్ణప్రసాద్, విబాగాధిపతి లీలాకుమారి సత్కరించి ఎఫ్‌డీపీలో పాల్గొన్న అధ్యాపకులు ధ్రువపత్రాలను అందజేశారు.

ఐటీఐల అభివృద్ధికి నిధుల కేటాయింపు

ఏపీ, తెలంగాణ మినిస్ట్రీ ఆఫ్ స్కిల్ డెవలప్‌మెంట్ రీజనల్ డైరెక్టర్ శ్రీనివాసరావు



కార్పొరేషన్(కాకినాడ), ఆగస్టు 2(ఆంధ్ర జ్యోతి): ఆంధ్ర రాష్ట్రానికి ఇదొక మంచి సువర్ణ అవకాశమని స్కిల్ డెవలప్‌మెంట్‌ప్రోగ్రాంపై ప్రభుత్వం కూడా ఎంతో పట్టుదలగా ముందుకు వెళుతుందని రెండేళ్ల క్రితం నిర్మలా సీతారామన్ కేంద్ర బడ్జెట్‌లో స్కిల్ డెవలప్‌మెంట్ అభివృద్ధికి రూ.66వేల కోట్ల నిధులు కేటాయించడంతోనే ఇప్పుడు స్కిల్ డెవలప్‌మెంట్‌పరంగా అభివృద్ధి ముందుకు వెళుతుందని ఏపీ, తెలంగాణ మినిస్ట్రీ ఆఫ్ స్కిల్ డెవలప్‌మెంట్ రీజనల్ కె.శ్రీనివాసరావు పేర్కొన్నారు. ఐటీఐలు అభివృద్ధిలో భాగంగా క్షేత్రస్థాయి పరిశీలనకు కాకినాడ ప్రభుత్వ ఐటీఐ కు ఆయన శనివారం వచ్చారు. ఈ సందర్భంగా ఐటీఐ ప్రిన్సిపల్ ఎం.వేణుగోపాల్ వర్మ అసిస్టెంట్ ట్రైనింగ్ ఆఫీసర్లు, డిప్యూ టీ ట్రైనింగ్ ఆఫీసర్లు, ట్రైనింగ్ ఆఫీసర్లుతో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ దేశవ్యాప్తంగా ఐటీఐలను అభివృద్ధి చేసే క్రమంలో కేంద్ర ప్రభుత్వం రూ.66,000 కోట్లు కేటాయించినట్లు, మొదటి విడతగా తిరుపతి, వైజాగ్ ఐటీఐలను అభివృద్ధి చేస్తున్నామన్నారు. దీని ద్వారా ఆధునిక యంత్ర పరికరాలు సమకూరుస్తున్నట్లు తెలిపారు. ఐటీఐలు ఏర్పాటుచేసి సుమారు యాభై ఏళ్లపైనే అవుతుంది. కాబట్టి పునర్నిర్మించాల్సిన అవసరం ఉందన్నారు. ఐటీఐల్లో 10 కొత్త కోర్సులు ప్రవేశపెడుతున్నట్లు తెలిపారు. అదేవిధంగా ఐటీఐ పూర్తి చేసిన విద్యార్థులకు మరిన్ని ఉద్యోగావకాశాలు, అప్రెంటీస్ కల్పించడానికి పరిశ్రమతో ఓ ఎంవోయులు చేస్తున్నామన్నారు.



ఓ పోలీస్ కష్టాలు..

కాకినాడ నగరంలో వాహనం మీద వెళుతూ పోలీస్ అన్న ఓ భుజానికి తుపాకీ, మరో భుజానికి లగేజీ బ్యాగ్ తగిలించుకుని అవస్థలు పడుతూ డ్రైవింగ్ చేస్తూ వెళుతున్న దృశ్యం ఆంధ్రజ్యోతి కెమెరాకు చిక్కింది.

-ఫొటో స్టాఫ్ ఫొటో గ్రాఫర్ కాకినాడ

దెయ్యాలు ఉన్నాయని భయపెట్టినా..

క్యాంపస్‌లోనే ఉంటున్నా!

» సమస్యలు పరిష్కరిస్తూ.. వర్శిటీ అభివృద్ధికి పాటుపడుతున్నా..
» ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ ప్రసన్నశ్రీ



(రాజమహేంద్రవరం- ఆంధ్రజ్యోతి)

ఒకనాడు నన్నయ వర్శిటీలో ప్రతి రోజూ ఏదో ఒక గొడవ.. భోజనం బాగాలేదని.. వర్శిటీ ప్రాంగణం అపరిశుభ్రంగా ఉందని.. సిబ్బంది అందుబాటులో ఉండడం లేదని..ఈవ్‌టీజింగ్ రకరకాల సమస్యలపై విద్యార్థులు ఆందోళనకు దిగిన సంఘటనలు అనేకం.. ఆ సమస్యలన్నింటినీ పరిష్కరించారు నన్నయ వర్శిటీ వీసీ ప్రసన్నశ్రీ.. ఈ సందర్భంగా ఆమెతో ఆంధ్రజ్యోతి చిట్‌చాట్..

విద్యార్థులు చదువుకు హితులవ్వాలి..

వీసీ: లైబ్రరీ అనేది క్యాంపస్‌కు దేవాలయం వంటిది. విద్యార్థులు నిత్యం అక్కడకు వెళ్లి చదవాలి. విద్యార్థులు పుస్తకాలకు హితులవ్వడం వల్ల వారిలో చైతన్యం వస్తుంది. వర్శిటీలో సుమారు 3000 మంది విద్యార్థులున్నారు. ఆర్ట్స్ కాలేజీ ప్రతి రోజు ఉదయం8.30 గంటల నుంచి సాయంత్రం వరకూ జరుగుతుంది. ఇక ఉదయం 8 గంటల నుంచి 1.30 గంటల వరకూ నిర్వహిస్తాం.మధ్యాహ్నం నుంచి విద్యార్థులంతా లైబ్రరీలో పుస్తకాలు చదివేటట్టు ప్రయత్నం చేస్తున్నాం. సైన్స్ కాలేజీ 9.30గంటల నుంచి 4.30గంటల వరకూ నడుస్తోంది. నన్నయ మ్యూజియం ఏర్పాటు చేయనున్నాం. ఆకర్షణీయంగా నీడ గడియారం ఏర్పాటు చేశాం.

సిబ్బంది కొరత ఉంది..

వర్శిటీలో 400మంది వరకూ టీచింగ్, నాన్ టీచింగ్ స్టాఫ్ ఉన్నారు.ఇంకా అవసరం ఉంది. నలుగురైదుగురు చేసే పనిని ఒకరు చేయాల్సి వస్తుంది. ఇక షిఫ్ట్ విధానంలో మార్చుతేనున్నాం. అందరూ ఒకే సమయం పాటించే యోచన చేస్తున్నాం. టీచింగ్, నాన్ టీచింగ్ స్టాఫ్ నిర్ణీత వేళలు పాటించాలి. బస్సు వచ్చే సమయానికి బయట కుర్చీ వేసుకుని కూర్చుంటున్నా.మొదట్లో ఇష్టానుసారం వచ్చేవారు కూడా ఇవాళ సమయపాలన చేస్తున్నారు. వర్సిటీ పరిధిలో 392 కాలేజీలు ఉన్నాయి.

వర్శిటీ పాలనపై రాజకీయ జోక్యం తగదు..

సిస్టమ్ బాగుండాలి. రాజకీయ సభలు కాకుండా విద్యాపరమైన అంశాలతో కూడిన మీటింగ్‌లు ఉండాలి. యూనివర్శిటీ పాలనా పరమైన అంశాల్లో రాజకీయ జోక్యం మంచిది కాదని నా ఫీలింగ్. అమ్మాయిలను వేధించిన వాళ్లను ఆన్ ది స్పాట్ పంపించేయాలి. కాని రకరకాల రాజకీయ ఒత్తిళ్ల వల్ల సిబ్బంది తప్పు చేసినా పంపలేని పరిస్థితి. అది విశ్వవిద్యాలయం బలహీనతగా మారకూడదు. పరిస్థితిని చక్కదిద్దే ప్రయత్నం చేస్తున్నా. అమ్మాయిలకు అండగా ఉంటున్నా.

వర్శిటీ క్యాంపస్‌లోనే నివాసం?

వీసీ: ఇవాళ చూడండి. నేను కూడా హాస్టల్‌లోనే భోజనం చేస్తున్నా. అందరూ హ్యాపీగా ఉన్నారు. నేను వర్శిటీ క్యాంపస్‌లోని వీసీ భవనంలోనే నివసిస్తున్నా. గతంలో ఎవరూ ఉండేవారు కాదు.. నన్నూ ఉండవద్దన్నారు. దెయ్యాలు ఉన్నాయని.. పాములు వస్తాయని భయపెట్టాలని చూశారు. కానీ నేను వినలేదు. ఇక్కడే ఉండి రాత్రి వేళ్లలో కూడా హాస్టళ్ల పరిస్థితిని పరిశీలిస్తున్నా.

నాలుగు భవనాలు పూర్తిచేస్తున్నాం..?

వీసీ: 2019 వరకూ ఉన్న ప్రభుత్వంలోనే నాలుగు భవనాలు మంజూరయ్యాయి. రకరకాల కారణాలతో తర్వాత పనులు సరిగ్గా కదలలేదు. ఇటీవల పనులు వేగవంతం చేశారు. సెప్టెంబరులోపు నాలుగు భవనాలు పూర్తిచేస్తాం. వర్శిటీకి అన్ని సొంత నిధులే..ప్రభుత్వం నిధులేమీ ఇవ్వడంలేదు. వర్శిటీ ఏర్పాటుకు భూమిని సొంత నిధులతో కొన్నాం. 360 ఎకరాలతో మొదటి ప్రభుత్వం నోటిఫై చేసింది.తర్వాత అది 250 ఎకరాలకు వచ్చింది. చివరకు రూ.91 ఎకరాలే ఇచ్చింది. మిగతా భూమి ఇస్తే పెద్ద వర్శిటీ అవుతుంది.

కొత్త కోర్సులను ప్రతిపాదించాం?

వీసీ: చాలా కొత్తకోర్సులు ప్రతిపాదించాం. డిప్లమో, సర్టిఫికెట్, పీజీ డిప్లమో వంటి కోర్సులు ప్రారంభించే యోచనలో ఉన్నాం. 3, 4, 6 నెలలు, ఏడాది కాలపరిమితిలో ఉండే కోర్సులను ప్రతిపాదించాం. మూడు నెలల కాలవ్యవధి అంటే సర్టిఫికెట్ కోర్సులు ఉంటాయి.

ప్రజల సహకారం కావాలి

వర్శిటీలో కొన్ని భవనాల పనులు ఆగిపోయాయి. ఎవరైనా దాతలు వచ్చి భవన నిర్మాణానికి అయ్యే ఖర్చులో సగం ఖర్చు భరిస్తే, ఆ భవనానికి వారికి ఇష్టమైన వారిపేరు పెట్టుకోవచ్చు. అందువల్ల దాతలు ముందుకు రావాలని కోరుతున్నాను. కలెక్టర్ పి.ప్రశాంతి దృష్టికి సమస్యను తీసుకెళ్లాను. గతంలో పోస్టల్, ఇతర కార్యాలయాలకు ఇక్కడి భవనాలు ఇచ్చారు. వాటిని ఖాళీ చేయిస్తున్నా.

దివాన్‌చెరువు ఫ్లైవోవర్‌కు

వర్చువల్‌గా శంకుస్థాపన

రాజమహేంద్రవరం, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): జిల్లాలో పలు జాతీయ రహదారి అభివృద్ధి పనులకు కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ శనివారం విజయవాడ నుంచి వర్చువల్‌గా శంకుస్థాపన చేశారు.దివాన్‌చెరువు ఫ్లైవోవర్ ను గామన్ బ్రిడ్జి అప్రోచ్ రోడ్డు జంక్షన్ నుంచి 3 కిలో మీటర్ల మేర రూ.327 కోట్లతో నిర్మించనున్నారు. ఇప్పటికే ఇక్కడ భూమి సేకరించడంతోపాటు, ఆక్రమణలు, ఇతర దుకాణాలు, ఇళ్లను కూడా తొలగించిన సంగతి తెలిసిందే. అలాగే రాజమండ్రి పరిధిలోని లాలాచెరువు, ఐటీసీ జంక్షన్, వేమగిరి జంక్షన్లను రూ.232 కోట్లతో అభివృద్ధి చేయనున్నారు. ఇక్కడ అండర్ పాసులు కూడా నిర్మించనున్నారు. విస్తరిస్తున్న చారిత్రిక రాజమహేంద్రవరం నగరానికి ఈ పనులు మరింత సౌకర్యాన్ని కల్పించనున్నాయి.

పుష్కరాలపై ప్లాన్ ఆఫ్ యాక్షన్ పంపండి

రైల్వే డీఆర్ఎం మోహిత్ సోనాకియా



రాజమండ్రి రైల్వే స్టేషన్‌ను పరిశీలిస్తున్న డీఆర్ఎం మోహిత్

రాజమహేంద్రవరం, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): విజయవాడ డివిజన్ రైల్వే మేనేజరు మోహిత్ సోనాకియా శుక్రవారం రాజమండ్రి, గోదావరి రైల్వే స్టేషన్లలో కలియదిరిగారు. ఉదయం నుంచి సాయంత్రం వరకూ వివిధ ప్రాంతాలను పరిశీలించారు.2027లో జరిగే పుష్కరాల నేపథ్యంలో ఆయన పర్యటన సాగింది. యాత్రికులకు సౌకర్యాలు కల్పించడానికి అవకాశం ఉన్న ఖాళీ ప్రదేశాలను చూశారు. గూడ్స్‌షెడ్, ఆర్పీఎఫ్ బ్యారెక్, ఎలక్ట్రికల్ రూంలు తదితర నిర్మాణాలను తొలగించడం, ఎఫ్‌ఓబీలతోసహా కొత్త నిర్మాణాలను ఎక్కడ చేయాలో సవివరంగా నివేదిక తయారు చేసి అందజేయాలని ఇంజనీరింగ్ విభాగ అధికారులను ఆదేశించారు. యాత్రికులు వచ్చిన వెంటనే స్టేషనులో ఎక్కడికి చేరుకోవాలో స్పష్టంగా నిర్దేశాలు ఉండాలన్నారు. అక్కడ అన్ని సదుపాయాలనూ కల్పించాల్సి ఉంటుందన్నారు. గోదావరి రైల్వేస్టేషను పరిశీలించి బ్రిడ్జి వైపు ప్లాట్‌ఫాం పొడవు పెంచడానికి ఉన్న అవకాశాలపై నివేదిక సిద్ధం చేయాలన్నారు. భద్రతకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం ప్లాన్ ఆఫ్ యాక్షన్‌తో సమన్వయం చేసుకొని రైల్వే చేయాల్సిన ఏర్పాట్లపై వివరంగా రిపోర్టును పంపాలని ఆర్పీఎఫ్‌ని ఆదేశించారు. తొలుతగా వీఐపీ లాంజ్‌లో అధికారులతో సమావేశమై మ్యాప్‌ను పరిశీలించి.. వారితో చర్చించారు. ఈ నెల 6 లేదా 7న దక్షిణ మధ్య రైల్వే జీఎం రాజమండ్రి రానున్న సందర్భంగా రైల్వే స్టేషన్లను డీఆర్ఎం నిశితంగా పరిశీలించారు.కార్యక్రమంలో సీనియర్ డీఈఎన్ కోఆర్డినేషన్ వరుణ్‌బాబు, సీనియర్ డీఈఎన్ నార్త్ గౌతమ్, సీనియర్ డీఓఎం నరేంద్రవర్మ,సీనియర్ డీసీఎం ప్రశాంత్‌కుమార్, ఏడీఈఎన్ ముత్యాలరావు, ఎస్ఎంఆర్ రంగనాథ్, ఆర్పీఎఫ్ ఇన్‌స్పెక్టర్ రాజు పాల్గొన్నారు.

గోవిందా..హరి గోవిందా..



ప్రత్యేక అలంకరణలో వేంకటేశ్వరస్వామి

వెంకన్న ఆలయానికి పోటెత్తిన భక్తులు
స్వామి వారి ఒక్కరోజు ఆదాయం రూ.67.67 లక్షలు

ఆత్రేయపురం, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయానికి శనివారం భక్తులు పోటెత్తారు. వేకువజామునే స్వామికి సుప్రభాతసేవ, నీరాజన మంత్రపుష్పం, ఐశ్వర్యలక్ష్మీహోమం, బాలభోగం తదితర కార్యక్రమాలు నిర్వహించి వివిధ రకాల పుష్పాలతో అలకరించారు. పలు ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు స్వామివారి తిరు వీధుల్లో ఏడు ప్రదక్షిణలు నిర్వహించుకుని మొక్కులు తీర్చుకున్నారు. తులభారాలు, కానుకలు సమర్పించుకుని అన్నప్రసాదం స్వీకరించారు. అనం తరం రాత్రి వివిధ సాంస్కృతిక ప్రదర్శనలు నిర్వహించారు. వివిధ సేవల ద్వారా స్వామి వారికి ఒక్కరోజు ఆదాయం రూ.67.67 లక్షలు లభించినట్టు ఉపకమిషనరు నల్లం సూర్యచక్రధరరావు తెలిపారు.

గోల్డ్‌బాబు సందడి: వాడపల్లి వేంకటేశ్వర స్వామి ఆలయంలో గోల్డ్‌బాబు సందడి చేశాడు. విజయవాడకు చెందిన వ్యాపారవేత్త మంచం శివశంకర సాయి కుమార్ ఒంటి నిండా బంగారు వస్తువులతో స్వామివారి సన్నిధికి చేరుకున్నారు.



రూ.కోటి విలువైన కిలో బంగారు ఆభరణాలు ధరించి తిరువీధుల్లో వేలాది మంది భక్తుల నడుమ ప్రదక్షిణలు చేశారు. భక్తులు సైతం గోల్డ్‌బాబును చూసి ఆశ్చర్యపోయారు. స్వామి వారిని దర్శించుకుని బయటకు వస్తున్న సమయంలో అతడితో సెల్ఫీలు దిగారు.

భీమేశ్వరాలయంలో కమ్యూనికేషన్స్ డీఐజీ పూజలు

ద్రాక్షారామ, జూలై 2(ఆంధ్రజ్యోతి): ద్రాక్షారామ భీమేశ్వరాలయాన్ని శనివారం కమ్యూనికేషన్స్ డీఐజీ ఎన్ఎస్‌జే విజయలక్ష్మి సతీసమేతంగా సందర్శించారు. భీమేశ్వరస్వామి, మాణిక్యాంబ అమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. దర్శన అనంతరం బేడా మండపంలో వేదపండితుల ఆశీర్వచనం అందుకున్నారు.



వినియోగదారుడు అంగీకరిస్తేనే స్మార్ట్‌మీటర్

» బలవంతంగా వేయడం లేదు
» తూర్పులో 44,646 అమర్చాం
» ఏపీఈపీడీసీఎల్ ఎస్ఈ తిలక్‌కుమార్



రాజమహేంద్రవరం సిటీ, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): స్మార్ట్ మీటర్లు వినియోగదారులకు బలవంతంగా వేయడంలేదని, వారు అంగీకరిస్తేనే అమర్చుతున్నామని ఏపీఈపీడీసీఎల్ ఎస్ఈ తిలక్‌కుమార్ పేర్కొన్నారు. రాజమహేంద్రవరం సర్కిల్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ అడ్వాన్స్ ప్లానింగ్ సిస్టమ్ స్మార్ట్ మీటర్ ద్వారా సాధ్యమౌతుందన్నారు. పూర్వం ఎలక్ట్రోమెకానిక్ మీటర్లు ఉండేవని రీడింగ్ తీసుకుని బిల్లులు అటుపై తీసుకువచ్చి ఇచ్చేవారని, అటుపై ఎలక్ట్రానిక్ మీటర్లు వచ్చాయి. కొంతకాలం రీడింగ్ తీసుకుని బిల్లును ఇచ్చేవారని అందులోనే క్యూఆర్ కోడ్ మీటర్లు ప్రవేశించాయన్నారు. స్కాన్ చేసి కరెంట్ బిల్లును జనరేట్ చేసే విధానం వచ్చిందన్నారు. ఇప్పుడు తాజాగా వచ్చిన స్మార్ట్ మీటర్ వల్ల అడ్వాన్స్ ప్లానింగ్ చేసుకోవచ్చన్నారు. వినియోగదారుడి ఆండ్రాయిడ్ మొబైల్‌లోనే తాను వినియోగిస్తున్న విద్యుత్‌ను ఎప్పటికప్పుడు తెలుసుకోవచ్చన్నారు. ప్రజలు సాంకేతికతను అంగీకరిస్తే మార్పు సాధ్యమై అభివృద్ధి సాధించవచ్చన్నారు. బిల్లు చెల్లింపులు సులభతరం అవుతుందన్నారు. ఇందులో రీచార్జిబుల్ అనేది వినియోగదారుడు ఇష్టాన్ని బట్టి ఉంటుందని కాని కచ్చితం కాదన్నారు.స్మార్ట్ మీటర్ విషయంలో ఎటువంటి అపోహలు పెట్టుకోవద్దని చెప్పారు.జిల్లాలో ఇప్పటివరకు 44,646 స్మార్ట్ మీటర్లును అమర్చామని, ఇందులో అధికారులు, ప్రజాప్రతినిధులు కూడా ఉన్నారన్నారు. కార్యక్రమంలో ఏపీఈపీడీసీఎల్ ఈఈ నక్కపల్లి సామ్యూల్, ఏ రాజశేఖర్, ఎం.రవికుమార్ పాల్గొన్నారు.

నన్నయలో 21, 22 తేదీల్లో జాతీయ సదస్సు

బ్రోచర్ ఆవిష్కరణలో వీసీ ఆచార్య ప్రసన్నశ్రీ



బ్రోచర్ ఆవిష్కరిస్తున్న వీసీ ప్రసన్నశ్రీ

దివాన్‌చెరువు, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయంలో ఈ నెల 21, 22 తేదీల్లో గిరిజన ప్రాచీన విజ్ఞాన పరిరక్షణపై జాతీయ సదస్సు నిర్వహిస్తున్నట్టు ఉపకులపతి ఆచార్య ఎస్.ప్రసన్నశ్రీ తెలిపారు. దీనికి సంబంధించిన బ్రోచర్‌ను విశ్వవిద్యాలయంలో శనివారం ఆమె ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నన్నయ వర్శిటీ విద్యాకళాశాల ఆధ్వర్యంలో ఐసీఎస్ఎస్ఆర్, ఎన్‌సీఎస్‌టీ ఆర్థిక సహకారంతో ఈ సదస్సు నిర్వహిస్తున్నామన్నారు. దీని ద్వారా గిరిజన ఆచార వ్యవహారాలు, సంప్రదాయాలు, సంస్కృతి, ఆదివాసి సంపద, గిరిజనహక్కులు, విద్య, వైద్యం, గిరిజన మహిళల విద్యఆవశ్యకత మొదలైన అంశాలు చర్చిస్తారని తెలిపారు. వివిధ రాష్ట్రాల నుంచి విద్యావేత్తలు, సామాజికప్రముఖులు, గిరిజన సలహాదారులు, పరిశోధకులు పాల్గొని తమ పరిశోధనా పత్రాలను, అభిప్రాయాలను పంచుకుంటారని చెప్పారు.

కలిసిరాని శ్రావణం..

- నేలచూపులు చూస్తున్న కర్పూర అరటి
- గతేడాది కంటే దిగజారిన ధరలు
- గెల రూ.100 నుంచి రూ.350లోపే
- రైతులు లబోదిబో


రావులపాలెం అరటి మార్కెట్ యార్డులో అమ్మకానికి సిద్ధంగా ఉన్న కర్పూర అరటిగెలలు

రావులపాలెం, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): శ్రావణమాసంపై ఎన్నో ఆశలు పెట్టుకున్న రైతుల ఆశలు ఆవిరి అయ్యాయి. శ్రావణంలో కూడా కర్పూర రకం అరటికి అనుకున్న ధర పలకకపోవడంతో నిరాశ చెందుతున్నారు. అంతర్ రాష్ట్ర అరటి మార్కెట్ యార్డుగా ఖ్యాతి గాంచిన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలోని రావులపాలెం అరటి మార్కెట్ యార్డుకు నిత్యం 10 వేల నుంచి 12వేల అరటి గెలల వరకు రైతులు తీసుకొస్తుంటారు. కాగా వీటిలో 6వేల నుంచి 8 వేల గెలల వరకూ కర్పూర రకం అరటీ మార్కెట్ యార్డుకు వస్తుంది. ఆషాఢం మాసంలో పెళ్లిళ్లు, శుభ ముహూర్తాలు లేకపోవడంతో ధరలు పెద్దగా పలకలేదు. శ్రావణ మాసం ప్రారంభం నుంచి శుభ కార్యాలు పండుగలు పూజలు, పర్వదినాలు ఉండటంతో కర్పూర రకం అరటికి అనుకున్న ధర కంటే అధిక ధర పలుకుతుందని రైతులు ఎదురుచూశారు. ఏదోకొది మేర మాత్రమే పెరగడంతో రైతులు నిరాశ చెందుతున్నారు.

ప్రస్తుతం ఇలా.. గతంలో అలా...

దిగుబడి పెరగడంతో గెలలు కూడా మార్కెట్‌కు పెద్దఎత్తున తరలివస్తున్నాయి. అయితే ప్రస్తుతం కర్పూర రకం అరటి గెల రూ.100 నుంచి రూ.350 వరకూ మాత్రమే పలుకుతుంది. అధిక పెట్టుబడులు పెట్టి ఎన్నో వ్యయప్రయాసలతో సాగు చేసిన పంట చేతికి అందివచ్చిన తరుణంలో అనుకున్న ధర పలకకపోవడంతో అరటి రైతులు ఎంతో ఆవేదన చెందుతున్నారు. గతేడాది శ్రావణ మాసం ప్రారంభంలో కర్పూర రకం అరటిగెల రూ.400 నుంచి రూ.600 వరకు పలికి రైతులు లాభాల బాట పట్టేవిధంగా మార్కెట్ సాగింది. కానీ ప్రస్తుతం ఆ పరిస్థితే కనిపించడంలేదని రైతులు దిగాలు చెందుతున్నారు.

వ్యాన్ ఢీకొని గిరిజనుడి మృతి

మరొకరికి తీవ్ర గాయాలు

అల్లూరి జిల్లా

సీమగండి మలుపు వద్ద ఘటన


మరణించిన బుచ్చన్నదొర

రంపచోడవరం, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): ఐసర్ వ్యాన్ ద్విచక్ర వాహనాన్ని ఢీకొనడంతో గిరిజనుడు మృతిచెందాడు. అల్లూరి జిల్లా మారేడుమిల్లి మండలం తూరు మామిడి గ్రామానికి చెందిన మడి పోతన్నదొర, కింటుకూరు గ్రామానికి చెందిన పాలంచి బుచ్చన్నదొర ద్విచక్రవాహనంపై బంధువులను పరామర్శించేందుకు శనివారం సోకులగూడెం వచ్చారు. తిరుగు ప్రయాణంలో పెద గెద్దాడ శివారు సీమగండి మలుపు వద్ద మారేడుమిల్లి నుంచి రంపచోడవరం వైపు వస్తున్న ఐసర్ వ్యాన్ వారి ఢీకొంది. ప్రమాదంలో పాలంచి బుచ్చన్నదొర(40) అక్కడికక్కడే మృతిచెందగా మడి పోతన్నదొరకు తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రుడికి రంపచోడవరం ఏరియా ఆసుపత్రిలో ప్రథమ చికిత్స నందించి మెరుగైన వైద్యం కోసం రాజమహేంద్రవరం తరలించారు. ఈ సంఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.


తీవ్ర గాయాలైన మడి పోతన్నదొర

రాజమహేంద్రవరంలో అగ్నిప్రమాదం

కాలి బూడిదైన ఫుట్‌వేర్ షాపు స్టాకు



షాపు నుంచి వస్తున్న పొగమంటలు

రాజమహేంద్రవరం, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరంలోని శ్యామలా టాకీస్ సమీపంలోని ఒక ఫుట్‌వేర్ షాపులో అగ్ని ప్రమాదం సంభవించింది. డీఎఫ్‌వో మార్టిన్ లూథర్ కింగ్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. బాలాజీ అక్వేరియం అండ్ పెట్, ఫ్యాక్టరీ ఫుట్‌వేర్ షాపుల్లో మంటలు వస్తున్నాయని శనివారం ఉదయం ఫోన్ వచ్చిందన్నారు. వెంటనే రాజమండ్రి, కొవ్వూరు నుంచి 3 ఫైరింజన్లను, సిబ్బందిని పంపించామన్నారు. శుక్రవారం అర్ధరాత్రి విద్యుత్ షార్టు సర్క్యూట్ వల్ల నిప్పు రాజుకుని ఉంటుందని ప్రాథమికంగా అంచనా వేస్తున్నామన్నారు. చెప్పులు, అట్టల వల్ల స్టాకు బూడిదైందని చెప్పారు. ఫైర్ సేఫ్టీ పరికరాలు తప్పనిసరిగా ఉండాలని ఆదేశించామన్నారు. ప్రాణ నష్టం జరగలేదని, ఆస్తి నష్టం అంచనా వేస్తున్నామన్నారు.

అసలేం జరిగిందంటే..!

ఫైరింజన్లు రావడం ఆలస్యం కావడంతో ఫుట్‌వేర్ షాపు పక్కనే ఉన్న అక్వేరియం, పెట్ షాప్‌కు కూడా మంటలంటుకుని మూగజీవాలు బలై, ఫుట్‌వేర్ షాపులో స్టాకు మొత్తం కాలిపోయిందని తెలుస్తోంది. చెప్పుల దుకాణం నుంచి మంటలు వస్తున్నాయని ఓ వ్యక్తి ఉదయం 6గంటల సమయంలో దగ్గరలో ఉన్న ఇన్నీసుపేట ఫైర్ స్టేషనుకు పరుగులు పెట్టాడు. అయితే అక్కడ ఒక్క ఉద్యోగి మాత్రమే ఉన్నాను కొవ్వూరు లేదా ఆర్యాపురం నుంచి ఫైరింజను వస్తుందని చెప్పడంతో అతడు వెనుదిరిగాడు. అరగంట అయినా రాకపోవడంతో మళ్లీ వెళ్లి మరింత బతిమలాడగా, మరో పావుగంట తర్వాత ఫైరింజను ఘటనా ప్రాంతానికి చేరుకుంది. ఈలోపు ఫుట్‌వేర్‌ని అనుకొని ఉన్న షాపులోకి మంటలు వ్యాపించి పక్షులు, కుక్కలు తదితర మూగజీవాలు బూడిదైపోయాయని స్థానికులు చెప్పారు. ఇన్నీసుపేట ఫైర్ స్టేషను నుంచి ఘటనా ప్రదేశం సుమారు 500 మీటర్లు మాత్రమే ఉండడం గమనార్హం.

గంజాయితో వ్యక్తి అరెస్ట్

జగ్గంపేట, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా జగ్గంపేట నుంచి కాకినాడ రోడ్డులో కాత్రావులపల్లి మెరకవీధికి చెందిన కె.లోవరాజు అలియాస్ పటేల్‌ను 4.38 కిలోల గంజాయితో శనివారం అరెస్ట్ చేశారు. కాత్రావులపల్లి ఐఓసీఎల్ పెట్రోల్ బంక్ సమీపంలో పెద్దాపురం ఎస్‌డీపీవో శ్రీహరిరాజు పర్యవేక్షణలో సీఐ వైఆర్‌కె శ్రీనివాస్, ఎస్ఐ శ్రీ రఘునందన్‌రావు నిందితుడిని అరెస్ట్ చేశారు. 4.38 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకుని పెద్దాపురం కోర్టులో హాజరుపర్చగా 14 రోజులు రిమాండ్ విధించగా రాజమహేంద్రవరం సెంట్రల్ జైలుకు తరలించారు.


నిందితుడిని పట్టుకున్న పోలీసులు

కొడుకు.. కుట్ర!

- బీమా కోసం మానవత్వాన్ని మంటకలిపి కన్నతండ్రిపై కొడుకు హత్యాయత్నం
- ప్రాణాలతో బయటపడ్డ తండ్రి
- కటకటాల పాలైన కొడుకు


హత్య చేసేందుకు వినియోగించిన కారు


నిందితుడు హర్షవర్ధన్

> బీమా సొమ్ముల కోసం మానవత్వాన్ని మంటకలిపి కన్న తండ్రినే చంపాలనుకున్నాడు కొడుకు. మోటారుసైకిల్‌పై వెళ్తున్న తండ్రిని కారుతో ఢీకొన్నాడు. పైగా గుర్తు తెలియని వాహనం ఢీకొందని పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసు విచారణలో ఆలస్యంగా నిజాలు బయటపడడంతో కటకటాల పాలయ్యాడు.

అమలాపురం రూరల్, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): హత్యాయత్నం కేసులో విప్పర్తి హర్షవర్ధన్‌ను అమలాపురం తాలూకా పోలీసులు అరెస్టు చేశారు. ఈ కేసు వివరాలను శనివారం అమలాపురం తాలూకా ఎస్ఐ వై.శేఖరబాబు విలేకర్లకు వివరించారు. కోనసీమ జిల్లా అమలాపురం రూరల్ మండలం సాకుర్రుకు చెందిన విప్పర్తి వెంకటరమణ వడ్రంగి పని చేసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. అతడి కుమారుడైన హర్షవర్ధన్ కంప్యూటర్‌లో డిప్లమో పూర్తిచేసి ఖాళీగా ఉంటున్నాడు. వైసీపీ అమలాపురం అసెంబ్లీ నియోజకవర్గ కోఆర్డినేటర్ డాక్టర్ పినిపే శ్రీకాంత్ అనుంగ అనుచరుల్లో ఒకడిగా గుర్తింపు పొందాడు. ఇటీవల హర్షవర్ధన్ సోదరి వివాహం చేశాడు. ఇల్లు కూడా కట్టుకున్నాడు. అయితే అప్పులు పెరిగిపోవడంతో తండ్రి వెంకటరమణ కోరమండల్ ఫైనాన్స్‌లో రూ.13లక్షలు రుణంగా తీసుకున్నాడు. అదే సమయంలో ఇన్సూరెన్సు ప్రీమియం కింద రూ.20వేలు కట్ చేశారు. ఆ విషయాన్ని అప్పట్లోనే హర్షవర్ధన్ మదిలో పెట్టుకున్నాడు. అంతే తండ్రిని చంపేస్తే తన ఈఎంఐల బాధ ఉండదు. ఇన్సూరెన్సు వస్తుందని పక్కా పథక రచన చేశాడు.

రూ.500 కావాలని పిలిచి..

ఏప్రిల్ 21న ఓ ఇన్నోవా కారును దుర్గాప్రసాద్ అనే వ్యక్తి వద్ద అద్దెకు తీసుకున్నాడు. పేరూరు వై.జంక్షన్‌లో కారుతో వెళ్లి తండ్రి వెంకటరమణకు ఫోన్ చేసి అర్జెంటుగా రూ.500 కావాలని చెప్పాడు. కొడుకుకు ఏ అవసరం వచ్చిందోనని మోటారుసైకిల్‌పై వెంకటరమణ భట్నవిల్లి బైపాస్ రోడ్డు వద్దకు చేరుకున్నాడు. తర్వాత స్వగ్రామమైన సాకుర్రు వెళ్లేందుకు బైపాస్ రోడ్డులో వెంకటరమణ మోటారుసైకిల్‌పై బయలుదేరాడు. కామనగరువు సమీపంలో తండ్రి బైక్‌ను కారుతో వేగంగా వచ్చి హర్షవర్ధన్ ఢీకొన్నాడు. తండ్రి చనిపోయాడని భావించి డ్యామేజ్ అయిన కారును తీసుకుని రోళ్లపాలెంలోని ఖాళీ స్థలంలో వదిలేసి హర్షవర్ధన్ బయటపడ్డాడు. బైపాస్ రోడ్డులో తీవ్ర గాయాలపాలై అపస్మారక స్థితిలో ఉన్న వెంకటరమణను స్థానికులు గుర్తించారు. అతడి వద్దనున్న సెల్‌ఫోన్‌లో చివరిగా ఫోన్ మాట్లాడిన కొడుకు హర్షవర్ధన్‌కు ఫోన్ చేసి విషయం తెలిపారు. దీంతో చేసేదేదిలేక తండ్రిని కిమ్స్ ఆసుపత్రికి తరలించాడు. ఆసుపత్రి నుంచి వచ్చిన సమాచారం మేరకు అమలాపురం తాలూకా పోలీసులు ఏప్రిల్ 22న కేసు నమోదు చేశారు. ఎస్ఐ వై.శేఖర్‌బాబు కేసు దర్యాప్తు చేపట్టారు.

పట్టించిన కారు..

తెలుపురంగు కారు గుద్ది వెళ్లినట్టు స్థానికులు చెప్పారు. అయితే బైపాస్ రోడ్డుకు సమీపంలోనే డ్యామేజ్ అయిన కారును ఉంచిన విషయాన్ని ఆ తోట యజమాని పోలీసుల దృష్టికి తీసుకువచ్చాడు. అది కూడా తెల్లకారే కావడంతో ఆ కారే ప్రమాదానికి వినియోగించిన కారుగా భావించారు. ఇన్నోవా కార్లను రాజమహేంద్రవరంలో కంపెనీ షోరూం వద్ద మరమ్మతులు చేస్తారని గుర్తించి అక్కడికి వెళ్లారు. ప్రమాదం జరిగిన తరువాత ఇప్పటి వరకు ఎన్నికార్లకు మరమ్మతులు చేశారో రికార్డులు పరిశీలించగా 5 తెలుపురంగు కార్లను గుర్తించారు. అయితే వాటిలో నాలుగు కార్లు కేవలం సర్వీసింగ్‌కు వచ్చినట్టు గుర్తించారు. ఒక కారు మాత్రం మరమ్మతులు చేసినట్టు గుర్తించి సంబంధిత నంబరుకు ఫోన్ చేసి సమాచారం తెలుసుకున్నారు. చెట్టును ఢీకొనడం వల్ల ముందు భాగం దెబ్బతిందని చెప్పడంతో కారు యజమాని దుర్గాప్రసాద్ కొన్ని రోజుల అనంతరం అక్కడి నుంచి కారును తీసుకువెళ్లి మరమ్మతులు చేయించుకున్నట్టు చెప్పాడు. అంతేకాకుండా హర్షవర్ధన్ సెల్‌ఫోన్ సిగ్నల్స్ ప్రమాదం జరిగిన సమయంలో అక్కడే సూచించడంతో హర్షవర్ధనే నిందితుడిగా పోలీసులు గుర్తించారు. ఈనెల 1న సాయంత్రం సాకుర్రు పీఆర్వో అయినాపురపు కృష్ణ ఎదుట హర్షవర్ధన్ లొంగిపోవడంతో పోలీసులకు ఆయన సమాచారం అందించాడు. హర్షవర్ధన్‌ను అదుపులోకి తీసుకుని హత్యాయత్నం కింద కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ శేఖర్‌బాబు తెలిపారు. అమలాపురం ఏజేఎఫ్‌సీఎం కోర్టులో హాజరుపరుచగా రిమాండ్ విధించినట్టు తెలిపారు. తండ్రిని చంపేందుకు ఉపయోగించిన ఇన్నోవా క్రిస్టా కారును సీజ్ చేశామన్నారు. కేసును చాకచక్యంగా దర్యాప్తు చేసిన రూరల్ సీఐ డి.ప్రశాంత్‌కుమార్, ఎస్ఐ శేఖర్‌బాబు, సిబ్బంది సీహెచ్ ఏసుబాబు, ఎం.నాగరాజు, కె.ఫణీంద్రకుమార్‌ను ఎస్పీ బి.కృష్ణారావు ప్రత్యేకంగా అభినందించారు. కొడుకే తనపై హత్యాయత్నానికి పాల్పడ్డాడని తెలుసుకున్న తండ్రి తల్లడిల్లి పోయాడు. పోలీసుల అదుపులో ఉన్న కొడుకుకు తండ్రే శనివారం భోజనం క్యారేజీ తీసుకురావడం చూసి అందరిక కళ్లు చెమర్చాయి.

చినశంకర్లపూడిలో ఆరు తాటాకిళ్లు దగ్ధం

- పేలిన గ్యాస్ సిలిండర్లు
- రూ.15లక్షల నష్టం
- భయబ్రాంతులకు గురైన ప్రజలు


చినశంకర్లపూడిలో దగ్ధమవుతున్న తాటాకిళ్లు

ప్రత్తిపాడు, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా ప్రత్తిపాడు మండలం చినశంకర్లపూడి గ్రామంలో శనివారం తెల్లవారుజామున భారీ అగ్ని ప్రమాదం సంభవించింది. దళితవాడలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా ఆరు తాటాకిళ్లు పూర్తిగా దగ్ధమయ్యాయి. రూ.15లక్షల ఆస్తినష్టం వాటిల్లింది. చినశంకర్లపూడి దళితవాడలో శనివారం వేకువజాము 1గంట సమయంలో షార్ట్ సర్క్యూట్ కారణం గా ఓ తాటాకింటికి మంటలు అంటు కుని 5గృహాలకు వ్యాపించాయి. దీంతో గంటన్నర వ్యవధిలో కాలిబూడిదయ్యాయి. ఇళ్లల్లో ఉన్న గ్యాస్ సిలిండర్లు మంటల్లో పేలడంతో ప్రజలు భయబ్రాంతులకు గురయ్యారు. మంగారావు, రాజబాబు, పి.అచ్చయ్య, పి.అప్పారావు, ఎం.నాగేశ్వరరావు, కె.సత్తిబాబుకు చెందిన తాటాకిళ్లు దగ్ధమయ్యాయి. బీరువాల్లోని దుస్తులు, బంగారు, వెండి, నగదు కాలిపోయాయి. సర్వం కోల్పోయి 6 కుటుంబాలు నిరాశ్రయులయ్యారు. ప్రత్తిపాడు ఫైర్ సిబ్బంది కె.రాముడు, కేఎస్ఎన్ మూర్తి, వీరగణేష్, డీఎల్‌వో నాగయ్య బృందం అగ్నిమాపక శకటంతో వెళ్లి మంటలను అదుపు చేశారు. అగ్ని ప్రమాద బాధితులను ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ పరామర్శించి ఓదార్చారు. దుస్తులు, నిత్యావసర సరుకులు, వంట సామాగ్రి, ఆర్థిక సహాయం అందజేశారు.


గ్యాస్ సిలిండర్లు పేలిన ప్రదేశాన్ని పరిశీలిస్తున్న ప్రత్తిపాడు ఎమ్మెల్యే సత్యప్రభ

రాష్ట్ర స్థాయి ఉపాధ్యాయ పురస్కారాలకు దరఖాస్తులు

కాకినాడ రూరల్, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని రాష్ట్ర ప్రభుత్వ, జెడ్పీ, ఎంపీ, ఎయిడెడ్, పురపాలక యాజమాన్యాలు, ఏపీఎంఎస్, ఏపీఎస్‌డబ్ల్యూఆర్‌ఈఐఎస్, ఏపీటీడబ్ల్యూఈఆర్‌ఈఐఎస్, ఏపీఆర్‌ఈఐఎస్, కేజీబీవీల యందు గల ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులు రాష్ట్రస్థాయి ఉపాధ్యాయ పురస్కారాలకు దరఖాస్తు చేసుకోవాలని డీఈవో పి.రమేష్ తెలిపారు. ప్రైవేట్ తప్ప అన్ని యాజమాన్యాల్లో పనిచేస్తూ కనీసం 10ఏళ్ల బోధనానుభవం గల అన్ని కేటగిరీలకు చెందిన ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులు deoeg.org వెబ్‌సైట్ నందు ఉంచబడిన దరఖాస్తును నియమ నిబంధనలననుసరించి అర్హత గల ఉపాధ్యాయులు పూరించి ఈనెల 12లోపు సంబంధిత తనిఖీ అధికారుల ద్వారా డీఈవో కార్యాలయంలో సమర్పించాలని సూచించారు.

సత్యదేవుడి ఖజానాకు భారీ ఆదాయం

దేవస్థానంలో సెల్‌ఫోన్లు భద్రపరిచే లైసెన్స్ హక్కుకు బహిరంగ వేలం

రూ.97.32 లక్షలు చెల్లించేందుకు ముందుకొచ్చిన గుత్తేదారు

అన్నవరం, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రమైన సత్యదేవుడి సన్నిధికి విచ్చేసే భక్తులు తమ సెల్‌ఫోన్లను భద్రపరిచేందుకు శనివారం నిర్వహించిన టెండర్ కం బహిరంగ వేలం ద్వారా స్వామి వారి ఖజానాకు భారీగా ఆదాయం లభించింది. ఏడాదికి రూ.97.32 లక్షలు చెల్లించేందుకు హెచ్చుపాటకు గుత్తేదారులు పోటీపడ్డారు. గతంలో ఈ లైసెన్స్ హక్కుకు రూ.39.72 లక్షలు మాత్రమే హెచ్చుపాట ఖరారయింది. ఒక్కో సెల్‌ఫోన్ భద్రపరిచేందుకు రూ.5 వసూలు చేయాలని టెండర్ షెడ్యూల్‌లో పొందుపరచగా గుత్తేదారు రూ.10 వసూలు చేసేవారు. దీనిపై గతంలో లోకాయుక్తాలో కేసు నమోదు చేయగా జరిమానా విధించారు. సింహాచలం, వాడపల్లి, ద్వారకా తిరుమల దేవస్థానాల్లో టెండర్ షెడ్యూల్ ఆధారంగా రూ.10 వసూలు చేసుకోవచ్చని ఆయా దేవస్థానాలు షెడ్యూల్ జారీచేయడంతో ఈ పర్యాయం అన్నవరం దేవస్థానంలో కూడా ఒక్కోఫోన్‌కు రూ.10 వసూలు చేసుకోవచ్చని పేర్కొనడంతో ఈ ఆదాయం లభించింది.

వేడుకగా ప్రాకారసేవ

సత్యదేవుడికి శనివారం ప్రాకారసేవ వేడుకగా జరిగింది. ఉదయం 10 గంటలకు స్వామి, అమ్మవార్లను ప్రధానాలయం నుంచి తూర్పురాజగోపురం వద్దకు మేళతాలతో తోడ్కొనివచ్చారు. అక్కడ నుంచి పండితుల మంత్రోచ్చరణలు, భక్తుల గోవిందనామస్మరణల నడుమ ముమ్మరు ప్రదక్షిణ గావించారు. అనంతరం హారతులిచ్చి ప్రధానాలయానికి తీసుకెళ్లారు.

అంతర్వేదిలో ఏపీ చీఫ్ సెక్రటరీ సతీమణి పూజలు

అంతర్వేది, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): కోనసీమ జిల్లా అంతర్వేదిలో కొలువై ఉన్న శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయానికి ఆంధ్రప్రదేశ్ చీఫ్ సెక్రటరీ సతీమణి, కుటుంబ సభ్యులు శనివారం విచ్చేశారు. వారికి ఆలయ అధికారులు, అర్చకులు ఘన స్వాగతం పలికారు. స్వామివారి దర్శనం అనంతరం వేద పండితులతో మహాదాశీర్వచనం జరిపించారు. స్వామివారి చిత్రపటం, ప్రసాదాలను వారికి ఆలయ సహాయ కమిషనర్ ఎం.ప్రసాద్ అందించారు. కార్యక్రమంలో తహశీల్దార్ వెంకటేశ్వరరావు, ఆర్ఐ రామరాజు పాల్గొన్నారు.


సీఎస్ సతీమణి, కుటుంబ సభ్యులకు స్వాగతం పలుకుతున్న అర్చకులు, అధికారులు

పేద విద్యార్థులకు ఉన్నత ప్రమాణాలతో కోచింగ్

శ్యామ్ ఇనిస్టిట్యూట్ చైర్మన్ శ్యామ్


చైర్మన్ శ్యామ్

కార్పొరేషన్(కాకినాడ), ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): పోలీస్ కానిస్టేబుల్స్ ఫలితాల్లో శ్యామ్ ఇనిస్టిట్యూట్ సాధించిన ఫలితాల్లో విద్యార్థులు, వారి కుటుంబ సభ్యులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఈ సందర్భంగా సంస్థ చైర్మన్ శ్యామ్ విలేకర్లతో మాట్లాడుతూ దాదాపు 4 వేలమందికి పైగా విద్యార్థులు పోలీస్ కానిస్టేబుల్స్‌గా ఎంపికయ్యారని తెలిపారు. ఒకే ప్రభుత్వ నోటిఫికేషన్లో 67 శాతం పైగా ఉద్యోగాలు సాధించి రికార్డు సృష్టించారన్నారు. ఇంతమందిని గెలిపించే అవకాశం రావడం దైవం నాకిచ్చిన గొప్ప అదృష్టంగా భావిస్తున్నామన్నారు. 2001 నుంచి 2025 వరకు దాదాపుగా 30 వేల మంది విద్యార్థులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులుగా తీర్చిదిద్ది శ్యామ్ ఇనిస్టిట్యూట్ ప్రభుత్వ ఉద్యోగుల మార్గసూచికగా మార్చామన్నారు. ఇప్పటి వరకు 5 సార్లు పోలీసు పరీక్షల్లో స్టేట్ ఫస్ట్ ర్యాంకులు సాధించడం జరిగిందన్నారు. పేద విద్యార్థుల కోసం తక్కువ ఫీజుతో ఆన్లైన్ కోచింగ్‌తో పాటు కాకినాడ వరకు రాలేని విద్యార్థుల కోసం దాదాపు 4 సంవత్సరాల పాటు 21 సెంటర్లలో 280 మోడల్ టెస్ట్‌లను నిర్వహించామన్నారు. పోలీస్ కోచింగ్ అంటే ఆంధ్ర ప్రజలు హైదరాబాద్ వెళ్లాలని అనుకునేవారని, అయితే ప్రస్తుత పరిస్థితుల్లో పోలీస్ కావాలంటే హైదరాబాద్ విద్యార్థి కూడా శ్యామ్ ఇనిస్టిట్యూట్‌కి వెళ్లాలనే స్థాయికి వచ్చామన్నారు. మా వద్దకు వచ్చిన ప్రతి విద్యార్థిని ప్రభుత్వ ఉద్యోగిగా మార్చడం, వారి తల్లిదండ్రుల నమ్మకాన్ని నిలబెట్టడం, దీంతో పాటు భవిష్యత్తులో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విడుదల చేసే ఏ ఉద్యోగ నోటిఫికేషన్‌కు అయినా పేద విద్యార్థులకు ఉన్నత ప్రమాణాలతో కూడిన కోచింగ్ అందించడమే మా లక్ష్యం అని తెలిపారు.

సత్యదేవుడి సన్నిధిలో భాగవత సదనం బృంద సభ్యులు

అన్నవరం, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లాలో ప్రముఖ పుణ్యక్షేత్రమైన సత్యదేవుడి సన్నిధికి శనివారం ఏలూరు జిల్లాకు చెందిన సుమారు 100మంది భాగవత సదనం బృంద సభ్యులు విచ్చేసి విష్ణుసహస్ర నామపఠనం, నామసంకీర్తన, కూచిపూడి నృత్యం తదితర భక్తి బావ కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులు తన్మయత్వంతో వీటిని ఆస్వాదించారు. ఈవో వీర్ల సుబ్బారావు అభినందించి వారికి స్వామి వారి దర్శనం, ఇతర సౌకర్యాలను కల్పించారు.


సత్యదేవుడి సన్నిధికి చేరుకున్న భాగవత సదనం బృంద సభ్యులు

మొండి బకాయిల వసూళ్లకు చర్యలు

మున్సిపల్ అడ్మినిస్ట్రేటివ్ అర్బన్ డెవలప్‌మెంట్ ప్రిన్సిపల్ సెక్రటరీ ఆదేశాలు


వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కాకినాడ అధికారులు

కార్పొరేషన్(కాకినాడ), ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): ఆస్తి పన్ను మొండి బకాయిల్లో భాగంగా కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలకు సంబంధించిన ఆస్తులపై కూడా దృష్టి సారించి మొండి బకాయిల వసూళ్లకు చర్యలు తీసుకోవాలని మున్సిపల్ కార్పొరేషన్ అధికారులకు రాష్ట్ర మున్సిపల్ అడ్మినిస్ట్రేటివ్ అర్బన్ డెవలప్‌మెంట్ ప్రిన్సిపల్ సెక్రటరీ ఎస్.సురేష్‌కుమార్ ఆదేశించారు. శనివారం అమరావతి నుంచి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో మున్సిపాల్టీ, కార్పొరేషన్ అధికారులతో పలు అంశాలపై ఆయన సమీక్షించా రు. ప్రధానంగా రెవెన్యూ వసూళ్లపై కీలక వ్యా ఖ్యలను సురేష్‌కుమార్ చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు సంబంధించి ఆస్తి పనులు, బకాయిలకు ఇప్పటి నుంచి నోటీసులు జారీ చేసి పనులు వసూలు చేయాలని ఆదేశించారు. ఖాళీ స్థలాలకు సంబంధించి యాజమాన్యాలు ఎవరూ పన్ను కట్టేందుకు ముందుకు రాని పక్షంలో ఖాళీ స్థలంలో మున్సిపాల్టీ కార్పొరేషన్లు స్వాధ ఖూన బోర్డులను పెట్టిన ఆ స్థలాన్ని స్వాధీనం చేసుకుని వాటిలో సామాజిక భవనం లేక పీహెచ్‌సీలు నిర్మాణానికి వినియోగించుకోవాలన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో కాకినాడ క్యాంప్ కార్యాలయం నుంచి కమిషనర్ భావన పాల్గొనగా నగరపాలక సంస్థ కార్యాలయంలో అదనపు కమిషనర్ కేటి సుధాకర్, డిప్యూటీ కమిషనర్ కె.శ్రీనివాసరావు, మేనేజర్ సీతారాం, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ పృధ్విచరణ్, టీపీఆర్‌వో శైలజ పాల్గొన్నారు.

గోదావరి ఒడ్డున గుర్తుతెలియని మృతదేహం లభ్యం



ఎటపాక, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): అల్లూరి జిల్లా ఎటపాక మండలం పురుషోత్తపట్నం వద్ద గోదావరి నది ఒడ్డు సమీపంలో శనివారం గుర్తుతెలియని మృతదేహం లభ్యమైంది. వివరాలు ఇలా ఉన్నాయి. గోదావరి నదికి చేపల వేటకు వెళ్లిన కొందరు మత్స్యకారులు మృతదేహం గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. మృతుడి వయస్సు 48 నుంచి 55 ఏళ్ల మధ్యలో ఉంటుందని పోలీసులు తెలిపారు. గోదావరి వరదకు కొట్టుకువచ్చి దాదాపు వారం రోజుల పైనే కావచ్చని, మృతదేహం కుళ్లిపోయి దుర్వాసన వస్తోందన్నారు. మృతుడి తరపున ఎవరైనా బంధువులు ఉంటే 6304181609 సంప్రదించాలని ఎస్ఐ అప్పలరాజు కోరారు.

పింగళి వెంకయ్యకు ఘన నివాళి

యానాం, ఆగస్టు2(ఆంధ్రజ్యోతి):జాతీయజెండా రూపకర్త పింగళి వెంకయ్యకు అధికారులు నాయకులు నివాళులర్పించారు. స్థానిక ఫెర్రీరోడ్డులోని ఆయన విగ్రహానికి మున్సిపల్ కమిషనర్ బుద్ధి అఖిల్, సీఐ అడలరసన్, ఎస్‌ఐ శేరు నూకరాజు, ఉపాధ్యాయుడు హంసని రామలక్ష్మణుడు తదితరులు పూలమాలలువేసి నివాళులర్పించారు

తల్లి పాలు అమృతంతో సమానం

అమలాపురంటౌన్, ఆగస్టు2(ఆంధ్రజ్యోతి): బిడ్డకు తల్లిపాలు అమృతంతో సమానమని ఐసీడీఎస్ ప్రాజెక్టు డైరెక్టర్ శాంతికుమారి పేర్కొన్నారు. శనివారం అమలాపురం శిశుగృహ వద్ద జిల్లాస్థాయి సదస్సు నిర్వహించి ఆమెమాట్లాడారు. అనంతరం నిర్వహించిన ర్యాలీలో ఐసీడీఎస్ సీడీపీవోలు, సూపర్‌వైజర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

తాగునీటి సమస్యలు లేకుండా చేస్తా



మాట్లాడుతున్న ఎమ్మెల్యే దేవ వరప్రసాద్

మలికిపురం, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో అన్ని గ్రామాలకు తాగునీటి సమస్య లేకుండా చేయడమే తన లక్ష్యమని ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ అన్నారు. దిండిలో శనివారం ఆంధ్రప్రదేశ్ పొల్యూషన్ కంట్రోల్ బోర్డు మంజూరు చేసిన పర్యావరణ పరిహార నిధులు రూ.43.10లక్షలతో నిర్మించిన 40వేల లీటర్ల కెపాసిటీ గల మంచినీటి వాటరు ట్యాంకును ఎమ్మెల్యే ప్రారంభించారు. ఏడాది కాలంలో రాజోలు నియోజకవర్గంలో అనేక మంచినీటి ట్యాంకులను నిర్మించుకున్నామన్నామని, సాధ్యమైనంత వరకు అన్ని గ్రామాలకు పూర్తిస్థాయిలో మంచినీరు ఇవ్వగలుగుతున్నామన్నారు. రాజోలు నియోజకవర్గానికి ఎన్జీటీ పరిహార నిధులు రావడానికి కృషిచేసిన ఎన్నారై యెనుముల వెంకటపతిరాజుకు ఈసందర్భంగా అభినందనలు తెలిపారు. సమావేశంలో ఎన్నారై యెనుముల వెంకటపతిరాజు, సర్పంచ్ ముదునూరి శ్రీనివాసరాజు, ఎంపీటీసీ తాడి దుర్గాసురేష్, గుండుబోగుల పెద్దకాపు, ఎంపీపీ ఎంవీ సత్యవాణి, మల్లిపూడి సత్తిబాబు, సూరిశెట్టి శ్రీనివాస్, బందెల పద్మ, దోనిపాటి రాజు, కె.శ్రీధర్, కట్టా బాబులు, శ్యామ్‌బాబు, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ బలోపేతానికి కృషి చేయాలి



మాట్లాడుతున్న జిల్లాశాఖ అధ్యక్షుడు సత్యనారాయణ

అమలాపురం టౌన్, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వంలో పొత్తు ధర్మాన్ని పాటిస్తూ పార్టీ బలోపేతానికి క్షేత్ర స్థాయి నుంచి కృషి చేయాలని బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే మానేపల్లి అయ్యాజీవేమా, కిసాన్‌మోర్చా జాతీయ కార్యవర్గ సభ్యుడు నల్లా పవన్‌కుమార్, జిల్లాశాఖ మాజీ అధ్యక్షుడు యాళ్ల దొరబాబు పేర్కొన్నారు. అమలాపురం కాటన్ అతిథిగృహంలో శనివారం బీజేపీ జిల్లా శాఖ పదాధికారుల సమావేశం జిల్లా శాఖ అధ్యక్షుడు అడబాల సత్యనారాయణ అధ్యక్షతన జరిగింది. తొలుత సత్యనారాయణ మాట్లాడుతూ బూత్ స్థాయి నుంచి పార్టీని బలోపేతం చేసేందుకు దిశానిర్దేశం చేశారు. అనంతరం ముఖ్య వక్తలు మాట్లాడుతూ త్వరలో జరిగే స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేసేందుకు పార్టీ శ్రేణులు క్షేత్రస్థాయిలో పార్టీని బలోపేతం చేయాలన్నారు. కూటమి ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా పనిచేస్తుందన్నారు. సమావేశంలో ఇన్‌చార్జి పొట్లూరి రామ్మోహన్, పాలూరి సత్యానందం, అనకాపల్లి జిల్లా ఇన్‌చార్జి కర్రి చిట్టిబాబు, ప్రధాన కార్యదర్శులు సలాది వీరబాబు, చీకురుమిల్లి శ్రీనివాస్, కొపనాతి దత్తాత్రేయ, జిల్లాపదాధికారులు పాల్గొన్నారు.

విద్యాభివృద్ధికి దాతల సహకారం అభినందనీయం



దాత సమకూర్చిన నిధులతో నిర్మించిన డైనింగ్ హాలు భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే గిడ్డి

మామిడికుదురు, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): విద్యాభివృద్ధికి పలువురు దాతలు అందిస్తున్న సహకారం అభినందనీయమని ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ అన్నారు. మామిడికుదురు హైస్కూలు ప్రాంగణంలో పూర్వ విద్యార్థి, పేదల డాక్టర్‌గా పేరుగాంచిన భూపతి నాగేశ్వరరావు జ్ఞాపకార్థం నిర్మించిన డైనింగ్ హాలు భవనాన్ని ఎమ్మెల్యే శనివారం ప్రారంభించారు. భూపతి నాగేశ్వరరావు కుటుంబ సభ్యులు సమకూర్చిన రూ.35లక్షలతో ఈభవనాన్ని సర్వాంగసుందరంగా తీర్చిదిద్దారు. స్కూలులో విద్యార్థినీ విద్యార్థులు భోజనాలు చేసేందుకు భవనం లోప బెంచీలు, బల్లలు ఏర్పాటుచేశారు. అనంతరం జరిగిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు. డైనింగ్ హాలు భవనాన్ని నిర్మించిన దాత కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే అభినందించారు. కార్యక్రమంలో ఏఎంసీ ఛైర్మన్ పెనుమాల లక్ష్మి, ఎంపీపీ కుసుమ వనజాకుమారి, ఎంపీటీసీలు నయినాల సీతామహలక్ష్మి, వర్థినేని రాము, సర్పంచ్ గౌస్ మొహిద్దీన్, జనసేన, బీజేపీ మండలశాఖల అధ్యక్షుడు జాలెం శ్రీనివాసరాజా, బైరిశెట్టి రామకృష్ణ, దాత కుటుంబ సభ్యులు, హెచ్ఎం బి.చిరంజీవిరావు, సీహెచ్ నిరంజని పాల్గొన్నారు.

బాలబాలాజీ స్వామికి ప్రత్యేక పూజలు



మామిడికుదురు, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): అప్పనపల్లి బాలబాలాజీ స్వామివారికి శనివారం పురస్కరించుకుని అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేకువజామునే వేదపండితులు వేదమంత్రోచ్చారణలతో సుప్రభాత సేవ నిర్వహించి ఘనంగా తొలిహారతి ఇచ్చారు. స్వామివారిని వివిధ రకాల పుష్పాలతో సర్వాంగ సుందరంగా అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. దేవస్థానం భక్తులతో కిటకిటలాడింది. శనివారం వివిధ అర్జిత సేవల టిక్కెట్ల విక్రయాల ద్వారా రూ.2,78,173 ఆదాయం వచ్చిందని, స్వామివారిని 5వేల మందిని దర్శించుకున్నారని, 2800మంది దేవస్థానంలో నిర్వహించే నిత్యాన్నదాన పథకంలో భోజనం చేశారని ఆలయ సిబ్బంది తెలిపారు. భక్తులకు ఏ విధమైన ఇబ్బందులు తలెత్తకుండా సిబ్బంది ఏర్పాట్లు చేశారు.

రైతులకు ఆర్థిక చేయూతనిచ్చేందుకే సాయం

- ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు
- అన్నదాత సుఖీభవ-పీఎం కిసాన్ చెక్కుల పంపిణీ

ముమ్మిడివరం, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): రైతులకు ఆర్థిక చేయూతనిచ్చేందుకు, వ్యవసాయ రంగాన్ని ప్రోత్సహించేందుకు పెట్టుబడి సాయం అందించేందుకు కూటమి ప్రభుత్వం అన్నదాత సుఖీభవ పథకాన్ని అమలుచేస్తుందని ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు పేర్కొన్నారు. కొమానపల్లి ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం ఆవరణలో శనివారం ఛైర్‌పర్సన్ పొద్దోకు నారాయణ(బాబు) అధ్యక్షతన జరిగిన అన్నదాత సుఖీభవ-పీఎం కిసాన్ పథకం చెక్కుల పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడారు. ముమ్మిడివరం నియోజకవర్గానికి సంబంధించి 23,468 మంది రైతులకు రూ.16,43,76,000 చెక్కును ఎమ్మెల్యే దాట్ల, కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ విడుదల చేశారు. కలెక్టర్ మహేష్‌కుమార్ మాట్లాడుతూ రూ.9.80లక్షల విలువైన డ్రోన్లను 80శాతం రాయితీపై రైతులకు అందిస్తున్నామని వాటిని వినియోగించుకోవాలన్నారు. జిల్లా వ్యవసాయాధికారి బోసుబాబు మాట్లాడుతూ అన్నదాత సుఖీభవ పథకంలో లబ్ధిచేకూరని రైతులుంటే రైతు సేవాకేంద్రాల్లో ఫిర్యాదుచేసి పరిష్కరించుకోవచ్చునన్నారు. వేదికపై ప్రధాని నరేంద్రమోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌ల చిత్రపటాలకు ఎమ్మెల్యే, కలెక్టర్‌లు వరిధాన్యం కంకులతో తయారుచేసిన దండలతో అభిషేకం చేశారు. ఐ.పోలవరం మండలం కేశనకుర్రుకు చెందిన రైతు సంఘం మహాలక్ష్మి గ్రూపునకు 80శాతం రాయితీపై డ్రోన్లు అందజేశారు. కార్యక్రమంలో పీఏసీఎస్ ఛైర్‌పర్సన్ పొద్దోకు నారాయణరావు, మాజీ ఎమ్మెల్యే చెల్లి వివేకానంద, నాగిడి నాగేశ్వరరావు, ఓగూరి భాగ్యశ్రీ, గొలకోటి దొరబాబు, గుద్దటి జమ్మి, ఎంపీపీ కోలా గంగాభవానీ, టేకుమూడి లక్ష్మణరావు, మందాల గంగసూర్యనారాయణ, గోదాశి పుండరీష్, దూడల స్వామినాయుడు, సాగి సూరిబాబురాజు, నడింపల్లి సుబ్బరాజు, కుంచనపల్లి నారాయణ, కుంచనపల్లి వెంకన్నబాబు, కేశాప్రగడ సూర్యనారాయణమూర్తి, గుద్దటి పట్టాభిరామయ్య, అర్థాని శ్రీనివాసరావు, బద్రి రమ, సర్పంచ్ కాశి ఇందిర, ఎంపీటీసీ సాధనాల వెంకట సుబ్రహ్మణ్యేశ్వరి, డ్వామా పీడీ మధుసూదనరావు, ఏడీఏ బి.గౌతమ్, ఏవో ఎస్.ప్రశాంత్‌కుమార్, సరిపల్లి శ్రీనివాసరాజు, కూటమి నాయకులు, వ్యవసాయశాఖఅధికారులు పాల్గొన్నారు.





ముమ్మిడివరం: ప్రధానిమోదీ, సీఎం చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌ల చిత్రపటాలకు వరిధాన్యం కంకుల దండలతో అభిషేకం చేస్తున్న ఎమ్మెల్యే దాట్ల, కలెక్టర్, ఉప్పలగుప్తం: చంద్రబాబు చిత్రపటానికి ధాన్యంతో అభిషేకం చేస్తున్న ఎమ్మెల్యే ఆనందరావు

రైతుల శ్రమను గుర్తించిన ప్రభుత్వం

పి.గన్నవరం, ఆగస్టు2(ఆంధ్రజ్యోతి): దేశానికే వెన్నుముకగా నిలిచే రైతన్నల శ్రమను గుర్తించింది కూటమి ప్రభుత్వమేనని ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ అన్నారు. అన్నదాత సుఖీభవ-పీఎం కిసాన్ మొదటి విడత సొమ్ము రైతుల ఖాతాల్లోకి జమ చేసే కార్యక్రమానికి ఎమ్మెల్యే అధ్యక్షత వహించి అనంతరం మాట్లాడారు. వైసీపీ ప్రభుత్వం రద్దు చేసిన యంత్రపరికరాలు పంపిణీని కూటమి ప్రభుత్వం పునఃప్రారంభించి సబ్సిడీతో యంత్ర పరికరాలను రైతులకు అందిస్తుందన్నారు. నియోజవకర్గంలో అన్నదాత సుఖీభవ-పీఎం కిసాన్ పథకంలో 23,727మంది రైతులకు రూ.16.31కోట్లు కూటమి ప్రభుత్వం అందించిందన్నారు. అనంతరం రైతులకు నమూనా చెక్‌ను అందించారు. ప్రధాని మోదీ, సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్‌ల చిత్రపటాలకు ధాన్యంతో అభిషేకం చేశారు. సమావేశం ఆవరణలో ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తుల విక్రయ కేంద్రాన్ని ఎమ్మెల్యే సందర్శించి బియ్యం, కూరగాయాలను కొనుగోలు చేశారు. నియోజకవర్గ ప్రత్యేకాధికారి, డీఆర్‌డీఏ పీడీ టి.జయచంద్రగాంధీ, డీఆర్‌సీ ఏడీ ఏవీఎస్ రాజశేఖర్, ఇన్‌చార్జ్ ఏడీ సీహెచ్‌డీ విజయకుమార్, శాస్త్రవేత్త ఎం.నందకిషోర్, ఇంచార్జ్ ఎంపీడీవో జి.ఉమామహేశ్వరావు, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డొక్కా నాథ్‌బాబు, మద్దాల సుబ్రహ్మణ్యం, చిట్టూరి శ్రీనివాస్, శిరిగినీడి వెంకటేశ్వరరావు, వాసంశెట్టి కుమార్, చొల్లంగి సత్యనారాయణమూర్తి, బొంతు పెదబాబు, సంసాని పెద్దిరాజు, సాధనాల శ్రీవెంకటసత్యనారాయణ, శేరు శ్రీనుబాబు, మొల్లేటి శ్రీను, బోణం బాబు, బొండాడ నాగమణి, ఆదిమూలం సూరయ్యకాపు, పులపర్తి చినవెంకటలక్ష్మి, గనిశెట్టి శ్రీను పాల్గొన్నారు.

అన్నమాట ప్రకారం సాయం

ఉప్పలగుప్తం, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నమాట ప్రకారం అన్నదాత సుఖీభవ అమలు చేసి రైతుల సంక్షేమమే అందరి సౌభాగ్యమని రుజువుచేశారని అమలాపురం ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు అన్నారు. గొల్లవిల్లి నిమ్మకాయల చినరాజప్ప కల్యాణమండపంలో శనివారం అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్ నిధుల విడుదల సందర్భంగా మండల వ్యవసాయాధికారి గుత్తుల కుమార్ బాబు ఆధ్వర్యంలో జరిగిన రైతు ఉత్సవ కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. అమలాపురం నియోజకవర్గంలో 13,364మంది రైతులకు రూ.6.68కోట్ల అన్నదాత సుఖీభవ, రూ.2.56కోట్ల పీఎం కిసాన్ నిధులు విడుదలైనట్టు జేసీ నిశాంతి ప్రకటించారు. ఉప్పలగుప్తం మండలంలో 4,212మందికి లబ్ధి చేకూరుతున్నట్టు వివరించారు. అన్నదాత సుఖీభవ చెక్కును ఎమ్మెల్యే ఆనందరావు విడుదల చేశారు. అనంతరం రైతుల ఆధ్వర్యంలో సీఎం చంద్రబాబు ఫ్లెక్సీకి ఆయన ధాన్యాభిషేకం చేశారు. కార్యక్రమంలో ఆముడా ఛైర్మన్ అల్లాడ స్వామినాయుడు, డీసీఎంఎస్ ఛైర్మన్ పెచ్చెట్టి చంద్రమౌళి, టీడీపీ వాణిజ్య విభాగం అధ్యక్షుడు దేశంశెట్టి వెంకటలక్ష్మీనారాయణ, పార్టీ మండల అధ్యక్షుడు అరిగెల నానాజీ, టీడీపీ జిల్లా రైతు అధ్యక్షుడు మట్టా మహాలక్ష్మీప్రభాకర్, కూటమి నాయకులు కంకటాల రామం, కల్వకొలను తాతాజీ, ఇసుకపట్ల రఘుబాబు, ఆకుల సూర్యనారాయణమూర్తి, పెచ్చెట్టి విజయలక్ష్మి, కర్రి దత్తుడు, ఆకుల బుజ్జి, చిక్కం సుధ, ఏఎంసీ ఛైర్మన్ అధికారి జయలక్ష్మి, గుత్తుల నాగేశ్వరావు అరిగెల నరేష్, చీకట్లఏసు, సలాది పట్టాభి, పేరాబత్తుల చిన్నా, సొసైటీ ఛైర్మన్లు, నీటిసంఘాల ఛైర్మన్లు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, రైతు సంఘాల నాయకులు పాల్గొన్నారు.

అన్నదాతల కుటుంబాల్లో ఆనందం

రాజోలు, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): అన్నదాతల కుటుంబాల్లో ఆనందం కోసం రైతులకు ఎన్డీఏ ప్రభుత్వం ఆర్థిక భరోసా కల్పిస్తుందని రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ అన్నారు. రాజోలు మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో గోదావరి సెంట్రల్ డెల్టా ప్రాజెక్టు ఛైర్మన్ గుబ్బల శ్రీనివాస్ అధ్యక్షతన శనివారంజరిగిన అన్నదాత సుఖీభవ, పీఎంకిసాన్ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. సూపర్-6లో భాగంగా అన్నదాత సుఖీభవ పథకం మొదటి విడతగా కేంద్ర ప్రభుత్వం ఇస్తున్న రూ.2వేలతో పాటు రాష్ట్ర ప్రభుత్వం రూ.5వేలు ఇస్తూ మొదటి విడతలో రూ.7వేలను రైతుల ఖాతాలో జమ చేశామని తెలిపారు. రాజోలు నియోజకవర్గంలో నాలుగు మండలాల్లో 23,293మంది రైతులకు రూ.16.30కోట్లను రైతుల ఖాతాలో జమ అయ్యాయన్నారు. రైతులకు అన్నదాత సుఖీభవ నమూనా చెక్కును అందజేశారు. అనంతరం మోదీ, చంద్రబాబు, పవన్‌కల్యాణ్ చిత్రపటాలకు ఎమ్మెల్యే దేవ, రైతులు ధాన్యంతో అభిషేకం చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర మార్క్‌ఫెడ్ డైరెక్టర్ గుండుబోగుల పెదకాపు, చాగంటి స్వామి, దిరిశాల బాలాజీ, పినిశెట్టి బుజ్జి, మేడిచర్ల సత్యవాణి, మల్లిపూడి సత్తిబాబు, పొలమూరి శ్యామ్‌బాబు, యింటిపల్లి ఆనందరాజు, కడలి నీటిసంఘం అధ్యక్షుడు గాలిదేవర వెంకన్నబాబు, కోఆప్షన్ సభ్యుడు షేక్ ఇస్మాయిల్, అడబాల యుగంధర్, సూరిశెట్టి శ్రీనివాస్, మాలే శ్రీనివాసనగేష్, జొన్నలగడ్డ గోపాలకృష్ణ, అడబాల చంటి, మామిడిశెట్టి నాగరాజు, రాజోలు ఇన్‌చార్జి ఏడీఏ ఎస్.రాకేష్, ఏవోలు వై.మధుకుమార్, సీహెచ్ రమ్యప్రియాకం, వీఏఏలు, వీహెచ్ఏలు తదితరులు పాల్గొన్నారు.





రాజోలులో రైతులకు చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే దేవ వరప్రసాద్, పి.గన్నవరంలో ప్రధాని, సీఎం, డిప్యూటీ సీఎం చిత్రపటాలకు ధాన్యంతో అభిషేకం చేస్తున్న ఎమ్మెల్యే గిడ్డి, నాయకులు

పుష్కరాల ఏర్పాట్లకు ప్రణాళికలు సిద్ధం చేయండి



పుష్కరాలపై సమీక్ష చేస్తున్న ఎమ్మెల్యే బుచ్చిబాబు

ఐ.పోలవరం, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): 2027లో జరిగే గోదావరి పుష్కరాలకు ఏర్పాట్లపై ప్రణాళికలు సిద్ధం చేయాలని ముమ్మిడివరం ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు పలు శాఖల అధికారులకు సూచించారు. ఎంతో ప్రతిష్టాత్మకంగా జరిగే పుష్కరాల విజయవంతానికి అధికారులు సమన్వయంతో పనిచెయ్యాలని విజ్ఞప్తి చేశారు. మురమళ్ళ క్యాంపు కార్యాలయంలో శనివారం జరిగిన సమీక్షలో పంచాయతీరాజ్, హెడ్‌వర్క్స్, ఇరిగేషన్, విద్యుత్, ఆర్‌అండ్ బి, దేవాదాయశాఖ అధికారులు పాల్గొన్నారు. మురమళ్ళ, కుండలేశ్వరం, గేదెల్లంక పుష్కర ఘాట్ల వద్ద అప్రోచ్ రోడ్ల నిర్మాణం, మరమ్మతులు, నూతన ఘాట్ల నిర్మాణం వంటి పనులకు అంచనాలు రూపొందించాలన్నారు. విద్యుత్ సౌకర్యం, రోడ్ల ఏర్పాటు, శానిటేషన్ అంశాలపై దృష్టి సారించాలన్నారు. ప్రధాన ఆలయాల వద్ద మౌలిక సదుపాయాల కల్పనపై ఆయాశాఖల అధికారులతో ఆయన సమీక్షించారు.

హైదరాబాద్ వెళ్లి పింఛన్ అందజేత



అల్లవరం, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ ఉంటున్న మహిళకు తాడికోన సచివాలయ సిబ్బంది పింఛను అందజేశారు. తాడికోనకు చెందిన సబ్బతి పద్మ అనారోగ్యంతో హైదరాబాద్‌లో ఉంటుంది. ఆమె సొంత ఊరు వచ్చేందుకు ఆరోగ్యం సహకరించలేదు. సర్పంచ్ సాధనాల సూర్యవెంకటనాగమణి ప్రోత్సాహంతో తాడికోన సచివాలయ మత్స్య సహాయకుడు బాలకృష్ణ హైదరాబాద్ వెళ్లి రూ.12వేలు మూడు నెలల పింఛన్ అందజేశారు.

అధ్యాపకులకు శిక్షణ

అమలాపురం టౌన్, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): జూనియర్ కళాశాలల్లో పనిచేస్తున్న అధ్యాపకులకు మారిన సిలబస్‌కు అనుగుణంగా సబ్జెక్టుల వారీగా వృత్యంతర శిక్షణలు అందిస్తున్నట్టు జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి వనుము సోమశేఖరరావు తెలిపారు. ఇంటర్మీడియట్ విద్యలో చేపట్టిన సంస్కరణల్లో భాగంగా అధ్యాపకులకు సిలబస్ మార్పులు, ప్రశ్నపత్రం మోడల్ తదితర అంశాలపై శనివారం శిక్షణను అమలాపురం ప్రభుత్వ జూనియర్ బాలికల కళాశాలలో ఆయన ప్రారంభించారు.కె.గణేశ్వరరావు పాల్గొన్నారు.

కానిస్టేబుల్‌గా ఎంపికైన ఆటో డ్రైవర్ కుమార్తె



నాగమణిని అభినందిస్తున్న జిల్లా రవాణాధికారి శ్రీనివాసరావు

అమలాపురం రూరల్, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): తాండవపల్లి గ్రామానికి చెందిన ఆటోడ్రైవర్ కుమార్తె జల్లి నాగమణి సివిల్ కానిస్టేబుల్‌గా ఎంపికైంది. శనివారం జిల్లా రవాణాధికారి దేవిశెట్టి శ్రీనివాసరావు ఆమె స్వగృహం వద్దకు వెళ్లి నాగమణిని అభినందించి సత్కరించారు. అదేవిధంగా తల్లిదండ్రులు సర్దార్‌బాబు, దమయంతిలను సత్కరించారు. ఈసందర్భంగా నాగమణి మాట్లాడుతూ ఎస్ఐ కావడమే తన లక్ష్యమని పేర్కొంది. ఆ లక్ష్య సాధనకు ఎటువంటి ఇబ్బందులు ఎదురైనా తెలియజేస్తే తనవంతు సహకారం అందిస్తానని డీటీవో పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా ఆటో యూనియన్ అధ్యక్షుడు వాసంశెట్టి సత్తిరాజు తదితరులు పాల్గొన్నారు.

తండ్రి బాటలో కుమార్తె



కాట్రేనికోన, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): తండ్రి బాటలోనే కుమార్తె పోలీసు ఉద్యోగాన్ని ఎంచుకుంది. నడవపల్లికి చెందిన సంసాని జ్యోతి డిగ్రీ వరకు చదివింది. ఆమె తండ్రి శ్రీనివాసరావు కాట్రేనికోన పోలీస్ స్టేషన్‌లో హెచ్‌సీగా పనిచేస్తున్నారు. తల్లి సత్యవేణి గృహిణి. ఎస్ఐ ఉద్యోగానికి ప్రయత్నించి అవకాశం లేకపోవడంతో పోలీసు ఉద్యోగం దక్కించుకుంది. ఈ సందర్భంగా పలువురు ఆమెను అభినందించారు.


మెరుగైన వైద్య సేవలందించాలి

అంబాజీపేట, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): పీహెచ్‌సీలో రోగులకు మెరుగైన వైద్యసేవలందించాలని అభివృద్ధి కమిటీ ఛైర్మన్, ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు సూచించారు. అంబాజీపేట పీహెచ్‌సీలో అభివృద్ధి కమిటీ సమావేశం వైద్యాధికారి కేఎన్ శ్రీనివాస్ అధ్యక్షతన జరిగింది. ఈసందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ సీజనల్ వ్యాధులు అధికంగా ఉన్న నేపథ్యంలో రోగులకు మెరుగైన సేవలందించాలన్నారు. వైస్ ఎంపీపీ నేతల నాగరాజు, ఎంపీటీసీల సమాఖ్య అధ్యక్షుడు ముత్తాబత్తుల ప్రశాంత్ పాల్గొన్నారు.

చేపల చెరువులకు అనుమతి ఇప్పించి ఆదుకోండి

ఉప్పలగుప్తం, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): ఆక్వా జోన్‌లో ఉన్న 80ఎకరాల చెరువుల్లో ఆక్వా సాగు నిలిచిపోయి ఆర్థిక ఇబ్బందులు పడుతున్నామంటూ సన్నవిల్లికి చెందిన రైతులు శనివారం గొల్లవిల్లిలో ఎమ్మెల్యే ఆనందరావును కలిసి వినతిపత్రం సమర్పించారు. 15ఏళ్ళు ఆక్వా సాగు అనంతరం గత కొన్నేళ్ళుగా చెరువులు ఖాళీగా ఉన్నాయన్నారు. చేపల సాగుకు అనుమతి ఇప్పించి తమ కుటుంబాలను ఆదుకోవాలంటూ కోరారు. వినతిపత్రంలో గనిశెట్టి సత్యనారాయణ, గనిశెట్టి గోవిందరాజులు, బద్రి సత్యనారాయణ, పెనుమెల్ల సత్తికొండ, జాన సూర్యకాంతం సంతకాలు చేశారు.

వృద్ధురాలి అదృశ్యంపై ఫిర్యాదు



మామిడికుదురు, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): మామిడికుదురు గ్రామానికి చెందిన అడ్డాల సూర్యావతి(70) అదృశ్యంపై ఆమె కుటుంబ సభ్యులు శనివారం నగరం పోలీసులకు ఫిర్యాదు చేశారు. శుక్రవారం రాత్రి ఒంటిగంట నుంచి కనిపించడం లేదని, లేత పసుపురంగు చీర ధరించిందని, ఎత్తు 5.5 అడుగులు, తెలుపురంగులో ఉంటుందని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఆచూకీ తెలిసినవారు 9553291436 నంబరుకు తెలియచేయాలని కోరారు. దీనిపై నగరం పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

పాఠశాలను తనిఖీ చేసిన ఉపవిద్యాశాఖాధికారి

అయినవిల్లి, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): ముక్తేశ్వరం జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలను రామచంద్రపురం ఉపవిద్యాశాఖాధికారి పి.లక్ష్మణమూర్తి శనివారం ఆకస్మికంగా తనిఖీచేశారు. రికార్డులను పరిశీలించి సంతృప్తి వ్యక్తంచేశారు. అనంతరం పాఠశాలలో జరుగుతున్న పీఎంశ్రీ పనులను పర్యవేక్షించారు. పదో తరగతి విద్యార్థులు ప్రత్యేక కార్యాచరణ ప్రణాళికతో ముందుకు వెళ్లాలని, ప్రతీరోజు ఆయా సబ్జెక్టులను చదివి పునశ్చరణ చేసుకోవాలని విద్యార్థులకు సూచించారు. మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించారు. ఎంఈవో కె.వెంకటేశ్వరరావు, హెచ్ఎం నిమ్మకాయల గణేశ్వరరావు, ఉపాధ్యాయులు తోపెల్ల శ్రీనివాసరావు, వీధి దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.

నిత్యాన్నదానానికి విరాళాలు

మామిడికుదురు, ఆగస్టు2(ఆంధ్రజ్యోతి): అప్పనపల్లిబాలబాలాజీ స్వామి నిత్యాన్నదాన పథకానికి పలువురు విరాళాలు అందించారు. తాటిపాకకు చెందినమొల్లేటి శ్రీనివాసరావు-శ్రీవరాహలక్ష్మి దంపతులు రూ.10,116, హైదరాబాద్‌కు చెందిన వేగిరౌతు లక్ష్మీపవన్-నాగుతులసిదంపతులు రూ.10,116 విరాళం అందించారు. దాత భక్తులకు ఆలయ అర్చకులు ఆశీర్వచనం అందజేసి స్వామివారిచిత్రపటం, ప్రసాదం అందించి అభినందించారు.

మలికిపురం డిగ్రీ కళాశాలలో కొత్త కోర్సులు

మలికిపురం, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): మలికిపురం ఎంవీఎన్‌జేఎస్ అండ్ ఆర్వీఆర్ డిగ్రీ కళాశాలలో కేంద్ర ప్రభుత్వం ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ రిమోట్ సెన్సింగ్ ఆధ్వర్యంలో నూతన కోర్సులు ఈవిద్యా సంవత్సరం నుంచి ఉచితంగా అందుబాటులోకి తీసుకువచ్చినట్టు ప్రిన్సిపాల్ ఎస్.ఆనందమహనీ శనివారం తెలిపారు. ఇటీవల తమ కళాశాలను సందర్శించిన ఇస్రో శాస్త్రవేత్త డాక్టర్ వైవీఎన్‌కే మూర్తి చొరవతో ఆన్‌లైన్ కోర్సుల నిర్వహణకు అవకాశం దక్కిందన్నారు. ఈకోర్సులు చేసేవిద్యార్థులు విదేశాల్లో అవకాశాలు పొందవచ్చని, అంతర్జాతీయంగా గుర్తింపు పొందిన కోర్సులన్నారు.

15నుంచి మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం

అమలాపురంరూరల్, ఆగస్టు2(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన మహిళల ఉచిత బస్సు ప్రయాణానికి సర్వంసిద్ధం చేస్తున్నట్టు ఏపీఎస్ ఆర్టీసీ జిల్లా ప్రజారవాణాధికారి ఎస్టీపీ రాఘవకుమార్ తెలిపారు. ఈనెల15వ తేదీ నుంచి ప్రభుత్వం ఈపథకాన్ని ప్రారంభిస్తున్నందున ప్రత్యేకంగా తయారు చేస్తున్న బస్సులను అమలాపురం ఆర్టీసీ డిపోలో శనివారం ఆయన పరిశీలించి కార్మికులు, సిబ్బందికి పలు సూచనలు చేశారు. టిమ్ మిషన్ల వినియోగంపై అవగాహన కల్పించాలని డిపో మేనేజర్ చల్లా సత్యనారాయణమూర్తికి సూచించారు. ఎన్.వరహాలబాబు పాల్గొన్నారు.

మూడు రోజులు విద్యుత్ సరఫరాకు అంతరాయం

అమలాపురం రూరల్ ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): అమలాపురం పట్టణంలో నూతన టవర్ల నిర్మాణంలో భాగంగా ఈనెల5వ తేదీ నుంచి మూడు రోజులు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని ఏఈ కె.రాంబాబు తెలిపారు. కొత్తలైనువేసేందుకు ఈనెల5,6,7 తేదీల్లో ఉదయం 7నుంచి 2గంటల వరకు ఈదరపల్లి నుంచి ముమ్మిడివరం గేట్ సెంటర్ వరకు, మెయిన్ రోడ్డు, సీతాపతిరావు పేట, మున్సిపల్‌కాలనీ, కూరగాయలమార్కెట్, దేవాంగులవీధి, సర్క్యులర్‌బజార్ ప్రాంతాల్లో సరఫరా ఉండదన్నారు.

వేంకటేశ్వరస్వామి ఆలయానికి పోటెత్తిన భక్తులు

అంబాజీపేట, ఆగస్టు2(ఆంధ్రజ్యోతి): అంబాజీపేటకొర్లపాటివారిపాలెంలో ఉన్న శ్రీభూదేవి శ్రీదేవి సమేత శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయం శ్రావణ శనివారం సందర్భంగా భక్తులతో పోటెత్తింది. స్వామి అమ్మవార్లకు వేకువజాము నుంచి అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు.

సిద్ధివినాయకుడిని దర్శించుకున్న అదనపు కమిషనర్



అయినవిల్లి, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): దేవదాయ ధర్మాదాయశాఖ అదనపు కమిషనర్ చంద్రకుమార్ కుటుంబ సమేతంగా శనివారం అయినవిల్లి శ్రీవిఘ్నేశ్వరస్వామివారిని దర్శించుకుని ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకుల ఆధ్వర్యంలో వేదాశీర్వచనం అందజేసి ఆయన్ను శేషవస్త్రంతో సత్కరించారు. వినాయకచవితి ఉత్సవాలకు తగిన ఏర్పాట్లు చేయాలని ఆలయ సహాయ కమిషనర్ అల్లు భవానీకి సూచించారు. జిల్లా దేవదాయాశాఖాధికారి సత్యనారాయణ పాల్గొన్నారు. అనంతరం వినాయక సదన్‌ను సందర్శించారు.

వీరేశ్వరస్వామి సేవలో ..

ఐ.పోలవరం, ఆగస్టు2(ఆంధ్రజ్యోతి): మురమళ్ళశ్రీభద్రకాళీసమేతవీరేశ్వరస్వామిని దేవదాయశాఖ అదనపు కమిషనర్ చంద్రకుమార్ దంపతులు శనివారం దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు, అధికారులు పూర్ణకుంభ స్వాగతం పలికారు. అదనపుకమిషనర్ దంపతులు పూజలు నిర్వహించారు. ఆలయఅసిస్టెంట్ కమిషనర్ వి.సత్యనారాయణ వారికి పట్టువస్త్రాలు సమర్పించి, దుశ్శాలువతో సత్కరించారు. స్వామిచిత్రపటం, ప్రసాదం అందించారు. ఆలయ పర్యవేక్షకుడు కటారి శ్రీనివాసరాజు పాల్గొన్నారు.

ముంపునీటిని బయటకు పంపండి: ఎమ్మెల్యే

పి.గన్నవరం, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): సాగుకు ఇబ్బందులు లేకుండా పంట పొలాల్లో ఉన్నముంపునీరును యుద్ధప్రాతిపదికన బయటకు పంపే ఏర్పాటు చేయాలని అధికారులు, కాంట్రాక్టర్‌కు ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ ఫోన్‌లో ఆదేశాలు జారీ చేశారు. మొదటి పంటకు ఇప్పటికే నాట్లు పూర్తయ్యాని, పంట నష్టపోకుండా ముంపునీరు బయటకు వెళ్లేలా చూడాలన్నారు. ముంగండ ముగ్గుబట్టీలు వద్ద డ్రైన్ నుంచి నీరు దిగకపోవడంతో సమస్యను స్థానిక రైతులు ఎమ్మెల్యే గిడ్డి దృష్టికి తీసుకువెళ్లారు. పి.గన్నవరం నీటిసంఘం డిస్ట్రిబ్యూటరీ కమిటీ వైస్ ఛైర్మన్ చొల్లంగి సత్యనారాయణమూర్తి సమస్యను ఎమ్మెల్యేకు వివరించారు. దీనిపై ఎమ్మెల్యే స్పందించి పంట పొలాల్లో ఉన్న ముంపునీటిని బయటకు పంపాలని అధికారులు, కాంట్రాక్టర్‌కు ఫోన్‌లో ఆదేశించారు. ఎమ్మెల్యే కలిసిన వారిలో రైతులు పిండి సుబ్రహ్మణ్యం, కోట శ్రీను, వడలి నాగేశ్వరరావు ఉన్నారు.

ప్రజల దాహార్తిని తీర్చడమే ధ్యేయం: ఎమ్మెల్యే దేవ

రాజోలు, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): రాజోలు నియోజకవర్గ ప్రజల దాహార్తిని తీర్చడమే లక్ష్యంగా పనిచేస్తున్నానని ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ అన్నారు. మెరకపాలెంలో ఆంధ్రప్రదేశ్ పొల్యూషన్ కంట్రోల్ బోర్డు మంజూరు చేసిన పర్యావరణ పరిహార నిధులు రూ.34లక్షలతో నిర్మించిన మంచినీటి వాటరు ట్యాంకును శనివారం ఆయన ప్రారంభించారు. గోదావరి సెంట్రల్‌డెల్టా ప్రాజెక్టు ఛైర్మన్ గుబ్బల శ్రీనివాస్, మార్క్‌ఫెడ్ డైరెక్టర్ గుండుబోగుల పెదకాపు, దిరిశాల బాలాజీ, సర్పంచ్ గిడుగు బుజ్జి, జనసేన పార్టీ మండల అధ్యక్షుడు సూరిశెట్టి శ్రీనివాస్, అడబాల సత్యరమేష్, అడబాల రాంబాబు, మామిడిశెట్టి నాగరాజు, కడలి మోహన్ పాల్గొన్నారు.

తల్లి పాల ప్రాముఖ్యతపై అవగాహన

యానాం, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): స్థానిక అంబేడ్కర్‌నగర్‌లో పాఠశాలలోని అంగన్‌వాడీ సెంటర్‌లో స్థానికులకు తల్లి పాల ప్రాముఖ్యతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. స్థానిక ప్రభుత్వ ఆయుర్వేద ఆసుపత్రి వైద్యురాలు లక్ష్మీ స్థానిక మహిళలకు అవగాహన కల్పించారు. పాఠశాల హెచ్ఎం విజయలక్ష్మీ, అంగన్వాడీ టీచర్ విజయలక్ష్మీ, వెంకటరమణ, పర్యావరణ పరిరక్షణ సమిత ప్రతినిధి దుగ్గుదూర్తి అనితశ్రీ పాల్గొన్నారు.

కిటకిటలాడిన వెంకన్న ఆలయాలు

రాయవరం, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): మండలంలోని వేంకటేశ్వరస్వామి ఆలయాలు శ్రావణ మాసం శనివారాన్ని పురస్కరించుకుని కిటకిటలాడాయి. రాయవరం శ్రీదేవి భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి ఆలయంలో అర్చకుడు పెద్దింటి కృష్ణమాచార్యులు ఆధ్వర్యంలో స్వామి వారికి పూజలు, హారతులు నిర్వహించి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. వెదురుపాక లక్ష్మీ పద్మావతి సమేత వేంకటేశ్వరస్వామి ఆలయంలో అర్చకుడు అంగర జనార్ధనాచార్యులు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. వి.సావరం, పసలపూడి తదితర గ్రామాల్లోని వెంకన్న ఆలయాల్లో భక్తులు పూజలు చేశారు.

వేంకటేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు

రావులపాలెం, (ఆంధ్రజ్యోతి): శ్రావణ శనివారాన్ని పురస్కరించుకుని వేంకటేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు జరిపారు. రావులపాలెంలోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో వేకువజాము నుంచే స్వామివారికి మేల్కొపు సేవ, సుప్రభాత సేవ, తొలిహారతి, అష్టోత్తర సహస్రనామ పూజలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

మహిళల కోసం హరిహర వీరమల్లు ప్రత్యేక షో



వీర మహిళలతో కలిసి కేక్‌కట్ చేస్తున్న జనసేన పార్టీ ఇన్‌చార్జ్ బండారు శ్రీనివాస్

రావులపాలెం, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): పవన్ కళ్యాణ్ నటించిన హరిహర వీరమల్లు చిత్రం విజయవంతంగా ప్రదర్శిస్తున్న నేపథ్యంలో వీర మహిళలకు ప్రత్యేక షో ఏర్పాటు చేసినట్లు జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ బండారు శ్రీనివాస్ తెలిపారు. రావులపాలెం పద్మశ్రీ థియేటర్‌లో మహిళల కోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ఈ షోకు పెద్దఎత్తున వీర మహిళలు తరలివచ్చారు. ఈ సందర్భంగా వారితో కలిసి కేక్ కట్ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ హిందూ ధర్మం గురించి ఈ చిత్రం నిర్మించారన్నారు. వైసీపీ నేతలు పవన్‌పై అక్కసుతో ఈ చిత్రం మీద దుష్ప్రచారం చేస్తున్న కారణంగా మహిళల కోసం ప్రత్యేకంగా ఈ చిత్ర పదర్శన నిర్వహించామన్నారు. కార్యక్రమంలో మండల శాఖ అధ్యక్షుడు తోట స్వామి, బండారు బాబి, అంబటి కిషోర్, గీద వెంకటేష్, గాయత్రి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



తాపేశ్వరంలో కల్వర్టును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు

కల్వర్టును ప్రారంభించిన ఎమ్మెల్యే వేగుళ్ల

మండపేట, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): మండపేట మండలం తాపేశ్వరం పంచాయతీ పరిధిలోగల గాగలపేట వినాయకుడి గుడి వద్ద 4వ నెంబరు కాల్వ మీద 15వ ఆర్థిక సంఘం నిధులతో నిర్మించిన వంతెనను ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు శనివారం ప్రారంభించారు. కార్యక్రమంలో సర్పంచ్ వాసంశెట్టి రాజేశ్వరి, నూని వీరరాజు, ముత్యాల పట్టాభి, కుంచే ప్రమోద్, మాజీ ఎంపీపీ పితాని వేంకటేశ్వరరావు, చీకట్ల గోవిందరాజు, వల్లూరి వీరభద్రరావు, ముత్యాల సత్యనారాయణ, వి.రామకృష్ణ తదితరులతో పాటు కూటమి నేతలు పాల్గొన్నారు.

సూర్యఘర్ పథకాన్ని సద్వినియోగం చేసుకోండి

మండపేట, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న సూర్యఘర్ సోలార్ విద్యుత్ సిస్టంను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ టీవీ రంగారావు కోరారు. మండపేట మున్సిపల్ కార్యాలయంలో శనివారం సచివాలయ, మున్సిపల్ ఉద్యోగులతో సంయుక్తంగా సూర్యఘర్ పథకానికి అందించనున్న ప్రభుత్వ రాయితీని తెలిపారు. భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని సోలార్ సిస్టంను అలవాటు చేసుకున విద్యుత్ బిల్లులు ఆదా చేసుకోవాలన్నారు. సమావేశంలో పలు విభాగాల మున్సిపల్ ఉద్యోగులు, సచివాలయ ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే బండారు శంకుస్థాపన

ఆలమూరు, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): ఆలమూరు ప్రభుత్వ జూనియర్ కాలేజీ చుట్టూ ప్రహరీ నిర్మాణానికి శనివారం కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు, జనసేన పార్టీ నాయకులు బండారు శ్రీనివాస్ శంకుస్థాపన చేశారు. దీని నిర్మాణానికి రూ.8లక్షల నిధులు మంజూరు అయ్యాయి. శిథిలమైన కాలేజీ భవనాలు తొలగించి త్వరలో నూతన భవనాలు నిర్మిస్తామని ఎమ్మెల్యే తెలిపారు. కాలేజీలోని ప్రతిభగల విద్యార్థులకు కొత్తపేట నియోజకవర్గ రైస్‌మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు వంటిపల్లి పాపారావు ఆర్థికసాయంతో ప్రోత్సాహక నగదు పురస్కారాలను అందజేశారు. కార్యక్రమంలో కాలేజీ ప్రిన్సిపాల్ రెడ్డితో పాటు, పలువురు అధ్యాపకులు పాల్గొన్నారు.

ప్రభుత్వ జూనియర్ కాలేజీ అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే బండారు →



ఇక్కడ ఆసుపత్రి ఉన్నా లేనట్టే...

• అందుబాటులో లేని సిబ్బంది • అవస్థలుపడుతున్న ప్రజలు, రోగులు
• చర్యలు తీసుకోవాలని మంత్రికి కూటమి నాయకుల ఫిర్యాదు

కె.గంగవరం, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): సుమారు తొమ్మిది గ్రామాల ప్రజలకు వైద్య సేవలు అందించాల్సిన ఆసుపత్రి నిర్వహణ అధ్వానంగా మారడంతో ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారు. పామర్రు పీహెచ్‌సీ 24 గంటలు సేవలు అందించాల్సి ఉన్నా అవేమీ ఇక్కడ కన్పించవు. ఇక్కడ ఇద్దరు వైద్యులు, ముగ్గురు స్టాఫ్‌నర్సులు, ఇతర సిబ్బంది ఉంటారు. ప్రజలకు 24 గంటలు అందుబాటులో ఉండి వైద్య సేవలు అందించాల్సి ఉంది. రాత్రిపూట అయితే ఒక వైద్యాధికారి, స్టాఫ్‌నర్సు, ఇతర సిబ్బంది ఉండి వైద్య సేవలందించాలి. ఇక్కడ పరిస్థితి దీనికి భిన్నంగా ఉంది. ఎలాంటి వైద్య సేవలు అందడం లేదని ప్రజలు, రోగులు ఆరోపిస్తున్నారు. ముఖ్యంగా కూటమి నాయకులే ఇక్కడి వ్యవహారంపై ఫిర్యాదు చేస్తున్నారు. ఇటీవల ఒక రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలవగా, వారు ఇక్కడికి తీసుకువచ్చారు. ఇక్కడ ఎవరూ అందుబాటులో లేకపోవడంతో రామచంద్రపురం ఏరియా ఆసుపత్రికి తరలించారు. రాత్రి పామర్రు గ్రామానికి చెందిన దళిత యువకుని కుమార్తెకు జ్వరం రాగా, ఆసుపత్రికి తీసుకువచ్చారు. రాత్రి విధుల్లో ఎవరూ లేకపోగా, లైట్లు, ఫ్యాన్లు వేసి వదిలేశారు. శనివారం ఉదయం 9 గంటలకు ఇదే పరిస్థితి నెలకొంది. రాత్రి ఆసుపత్రికి వచ్చిన దళిత యువకుని కుమార్తెకు స్థానిక టీడీపీ నాయకుడు పీఎంపీ వద్దకు పంపించి సొంత ఖర్చులతో వైద్యం చేయించి పంపించారు. దీనిపై ఆ వ్యక్తి కార్మికశాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్‌కు, డీఎంహెచ్‌వోకు ఫిర్యాదు చేశారు. నాలుగు నుంచి ఆరు వరకు ఆశవర్కర్‌లకు ఆసుపత్రి అప్పగించి మిగిలిన సిబ్బంది గైర్హాజరు అవుతున్నట్టు తెలిసింది.



ఆసుపత్రి గేటు వద్ద వేచి చూస్తున్న వృద్ధుడు

అభివృద్ధిని చూసి ఓర్వలేక ఆరోపణలు



మాట్లాడుతున్న టీడీపీ నేతలు

ఆత్రేయపురం, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను చూసి ఓర్వలేకనే వైసీపీ లేనిపోని ఆరోపణలు చేస్తున్నారని ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు పాలంగి రవిచంద్ర, బీసీ సెల్ అధ్యక్షుడు మిద్దే గోపాలకృష్ణ, టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి గుడేల నాగేంద్ర ఆరోపించారు. శనివారం తాడిపూడి టీడీపీ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో వైసీపీ ఆరోపణలను తిప్పికొట్టారు. ఎమ్మెల్యే బండారు సత్యానందరావు ఆధ్వర్యంలో చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను చూసి తట్టుకోలేక వైసీపీ శ్రేణులు నిరాధార ఆరోపణలు చేస్తున్నారన్నారు. చౌకబారు విమర్శలు విడనాడలని హితవు పలికారు. సమావేశంలో టీడీపీ మండల ఉపాధ్యక్షులు తోట రజని, సొసైటీ అధ్యక్షుడు నాగిరెడ్డి సత్యనారాయణ, టీడీపీ గ్రామ అధ్యక్షుడు కూనంపూడి రమేష్‌రాజు, టీడీపీ ఎస్సీ సెల్ మండల ఉపాధ్యక్షుడు చల్లపూడి పవన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

కొత్తపేట, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): వీకేవీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మేథమెటిక్ బోధించేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ కేపీ రాజు కోరారు. ఈ నెల 5న సాయంత్రంలోపు దరఖాస్తులు సమర్పించి 6న ఉదయం 11 గంటలకు జరిగే ఇంటర్వ్యూలకు హాజరుకావాలని ప్రిన్సిపాల్ కోరారు.



ఆలమూరులో అన్నదాత సుఖీభవ చెక్కులను రైతులకు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే బండారు సత్యానందరావు



మండపేటలో రైతులకు మంజూరైన చెక్కును పంపిణీ చేసున్న ఎమ్మెల్యే వేగుళ్ల, ఏపీఐడీసీ చైర్మన్ వేగుళ్ల లీలాకృష్ణ



ద్రాక్షారామలో అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్ చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్సీ రాజశేఖర్ తదితరులు

అన్నదాత శ్రేయస్సే ప్రభుత్వ ధ్యేయం

ఆలమూరు, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): అన్నదాతకు కూటమి ప్రభుత్వం అండగా నిలుస్తుందని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అన్నారు. ఆలమూరులో శనివారం కొత్తపేట నియోజకవర్గస్థాయిలో రైతులకు అన్నదాత సుఖీభవ చెక్కులు పంపిణీ చేశారు. కూటమి ప్రభుత్వం రైతులకు ఎన్నో సదుపాయాలు కల్పిస్తున్నదని ఇందులో భాగంగా నియోజక వర్గంలోని 23,018 మంది రైతులకు రూ.16.11 కోట్ల మేర పంటసాగుకు ఆర్థికసాయం అందిస్తామని ఎమ్మెల్యే తెలిపారు. ఈ సందర్భంగా ప్రధాని మోడీ, సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌ల చిత్రపటాలకు రైతులు ధాన్యంతో అభిషేకం చేశారు. కార్యక్రమంలో కొత్తపేట ఆర్డీవో శ్రీకర్, జనసేన పార్టీ కొత్తపేట నియోజకవర్గ ఇన్‌చార్జ్ బండారు శ్రీనివాస్, ఎంపీపీ తోరాటి లక్ష్మణరావు, కూటమి నాయకులు ఆకుల రామకృష్ణ, కేవీ సత్యనారాయణరెడ్డి, కరుటూరి నరసింహారావు తదితరుతలో పాటు, కొత్తపేట ఏడిఏ రామారావు, తహశీల్దార్ ప్రకాష్‌బాబు, ఎంపీడీవో ఎ.రాజు, పలువురు అధికారులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

హామీలు నెరవేరుస్తున్న ఘనత ప్రభుత్వానిదే

రాయవరం, (ఆంధ్రజ్యోతి): ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేసిన ఘనత కూటమి ప్రభుత్వానికే దక్కుతుందని టీడీపీ సీనియర్ నేత ఉండవిల్లి రాంబాబు అన్నారు. శనివారం అన్నదాత సుఖీభవ పథకం నిధులు విడుదల కార్యక్రమాన్ని స్థానిక రైతు సేవా కేంద్రం వద్ద రైతులతో కలిసి వీక్షించారు. రైతులనుద్దేశించి ఆయన మాట్లాడుతూ రైతుల సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందన్నారు. మండలంలోని 12 గ్రామాల్లో 5,090 మంది రైతులకు లబ్ధి చేకూరనున్నట్లు వ్యవసాయ అధికారి తెలిపారు.

చెక్కుల పంపిణీలో ఎమ్మెల్యేలు బండారు, వేగుళ్ల

రైతులకు కూటమి ప్రభుత్వం అండ
ఎమ్మెల్సీ రాజశేఖర్

ద్రాక్షారామ, (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం అన్నదాతలకు అండగా నిలుస్తుందని ఎమ్మెల్సీ పేరాబత్తుల రాజశేఖర్ అన్నారు. శనివారం ద్రాక్షారామలో వ్యవసాయ మార్కెట్ కమిటీ యార్డులో అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్ యోజన చెక్కుల పంపిణీలో ఎమ్మెల్సీ రాజశేఖర్ పాల్గొన్నారు. టీడీపీ నాయకుడు వాసంశెట్టి సత్యం అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం రైతుల శ్రేయస్సుకు అధిక ప్రాధాన్యం ఇస్తోందన్నారు. ఈనెల 15వ తేదీ నుంచి ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం ప్రారంభిస్తామన్నారు. టీడీపీ నాయకుడు వాసంశెట్టి సత్యం మాట్లాడుతూ నియోజకవర్గంలో 28,328 మంది రైతులకు రూ.16.68 కోట్లు అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్ యోజన పథకంలో పంపిణీ చేశామన్నారు. ఆర్డీవో అఖిల మాట్లాడుతూ రైతులు పీఎం పసల్ బీమాయోజన, పంటల బీమా పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో 28,328 మంది రైతులకు 16.68 కోట్ల చెక్కును అందచేశారు. కార్యక్రమంలో టీడీపీ తెలుగు యువత రాష్ట్ర ఉపాధ్యక్షుడు అక్కల రిష్వంత్‌రాయ్, నియోజకవర్గ పరిశీలకుడు కాకినాడ రామారావు, వ్యవసాయ శాఖ అధికారులు ఏడిఏ నాగకుమార్, ఏవోలు టీవీఆర్ మణిదీప్, ఎ.సద్గురుమూర్తి, వి.అశోక్ సర్పంచ్ కొత్తపల్లి అరుణ, టీడీపీ మండల అధ్యక్షుడు కొత్తపల్లి శ్రీను, కూటమి నాయకులు, సహకార సంఘాల త్రీమెన్ కమిటీ చైర్మన్లు, నీటి వినియోగదారుల సంఘాల అధ్యక్షులు, అధిక సంఖ్యలో రైతులు పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వం రైతుల పక్షపాతి
ఎమ్మెల్యే వేగుళ్ల

మండపేట, (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం వ్యవసాయానికి పెద్దపీట వేస్తోందని ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు అన్నారు. మండపేట నియోజక వర్గంలో అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్ కార్యక్రమాన్ని శనివారం మండపేట సీతారామ కల్యాణ మండలంలో ఏర్పాటు చేశారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే మాట్లాడుతూ దళారులకు అవకాశం లేకుండా నేరుగా రైతుల ఖాతాల్లోకి నగదు జమ చేసిందన్నారు. నియోజకవర్గంలో 18,229 కుటుంబాలకు మంజూరైన సాయం చెక్కు రూ.12.49 కోట్లను రైతులకు ఎమ్మెల్యేతో పాటు, ఏపీఐడీసీ చైర్మన్ వేగుళ్ల లీలాకృష్ణ అందజేశారు. కార్యక్రమంలో మండపేట మున్సిపల్ చైర్మన్ పతివాడ నూకదుర్గారాణి, మున్సిపల్ మాజీ చైర్మన్ చుండ్రు శ్రీవరప్రకాష్, నల్లమిల్లి వీర్రెడ్డి, తూర్పుకాపు కార్పొరేషన్ డైరెక్టర్ గడి సత్యవతి, శెట్టిబలిజ కార్పొరేషన్ డైరెక్టర్ జయబాబు, మాదిగ కార్పొరేషన్ డైరెక్టర్ మందపల్లి చంద్రశేఖర్, ఎంపీపీ ఉండమట్ల శ్రీనివాసు, మల్లిపూడి గణేష్, బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ కె.సాయిబాబా, బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు కె.సత్యనారాయణ, నియోజకవర్గ ప్రత్యేక అధికారి ఎం.శ్రీనివాస్, ఆలమూరు వ్యవసాయశాఖ డిసిహెచ్.కెవి చౌదరి, మండపేట, కపిలేశ్వరపురం, రాయవరం మండల వ్యవసాయ అధికారులు కె.ప్రభాకర్, బలుసు రవి, ఎన్.వి.రమేష్‌కుమార్, మండపేట తహసీల్దార్ తేజేశ్వరరావు, ఎంపీడీవో సత్యనారాయణ మూర్తి తదితరులు పాల్గొన్నారు.



చింతలూరు నూకాంబిక ఆలయానికి విరాళం అందిస్తున్న దాత

నూకాంబిక ఆలయానికి విరాళం

ఆలమూరు, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): చింతలూరు నూకాంబిక అమ్మవారి ఆలయానికి శనివారం ఈదల వెంకట్రావు, అనంతలక్ష్మి దంపతులు రూ.50,116 విరాళాన్ని అందజేశారు. ఆలయంలో జరుగుతున్న అభివృద్ధి పనుల నిమిత్తం విరాళం ఇచ్చినట్లు వారు తెలిపారు. దాతలను ఆలయ ఈవో వుండవల్లి వీర్రాజుచౌదరి, ఆలయ అభివృద్ధి కమిటీ ప్రతినిధులు గన్ని వెంకట్రావు, వైట్ల శేషబాబు, దొమ్మేటి రామకృష్ణ, బుంగ శ్రీనివాస్ తదితరులు అభినందించారు.



జాతీయస్థాయి బిషప్, పాస్టర్స్ ఫెలోషిప్ నూతన కార్యవర్గం దృశ్యం

కార్యవర్గం ఎన్నిక

మండపేట, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): జాతీయస్థాయిలో బిషప్, పాస్టర్స్ ఫెలోషిప్ కార్యకలాపాలు విస్తరిస్తున్నామని సంస్థ జాతీయ వ్యవస్థాపక అధ్యక్షుడు బిషప్ డాక్టర్ ప్రతాప్ సిన్హా కొమానపల్లి అన్నారు. తాపేశ్వరంలో బిషప్ డానియల్‌పాల్ చర్చి అవరణలో శనివారం జరిగిన జాతీయస్థాయి బిషప్ పాస్టర్స్ ఫెలోషిప్ కార్యవర్గ సమావేశం జరగ్గా, జాతీయస్థాయి కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. దేశవ్యాప్తంగా తమ సంఘ కార్యకలాపాలను విస్తరిస్తున్నామన్నారు. ప్రతాప్‌సిన్హా జాతీయ కార్యవర్గాన్ని ప్రకటించారు. దీనికి దేశం నలుమూలల నుంచి వచ్చిన దైవజనులు బిషప్‌లు హాజరయ్యారు. సంఘం తరపున చేయాల్సిన పనులను సమావేశంలో చర్చించారు. నూతన కార్యవర్గాన్ని బిషప్‌లతోపాటు దైవజనులు అభినందించారు. కార్యక్రమంలో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన దైవజనులు తదితరులు పాల్గొన్నారు.



ఫ్రెండ్‌షిప్ బ్యాడ్జీలను కట్టుకుంటున్న దృశ్యం

సిద్ధార్థలో స్నేహితుల దినోత్సవం

ఆలమూరు, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): ఆలమూరు సిద్ధార్థ హైస్కూల్‌లో శనివారం స్నేహితుల దినోత్సవాన్ని నిర్వహించారు. ప్రతి ఏడాది ఆగస్టు మొదటి ఆదివారం దీన్ని జరుపుకుంటారని ముఖ్య అతిథిగా పాల్గొన్న స్కూల్ డైరెక్టర్ కె.ముల్లారావు అన్నారు. విద్యార్థినీ, విద్యార్థులకు స్నేహితుల దినోత్సవం శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఒకరినొకరు ఫ్రెండ్‌షిప్ బ్యాడ్జీలను కట్టుకుని శుభాకాంక్షలు తెలుపుకున్నారు. కార్యక్రమంలో స్కూల్ ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సీపీఐ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలి

రామచంద్రపురం(ద్రాక్షారామ), ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): ఒంగోలులో ఈనెల 24 నుంచి 26 వరకు జరగనున్న సీపీఐ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని సీపీఐ నాయకులు డాక్టర్ చెలికాని స్టాలిన్ కోరారు. శనివారం రామచంద్రపురంలోని ఆయన నివాసంలో ప్రజా నాట్యమండలి ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా సమావేశంలో పూర్వపు అధ్యక్షుడు బొడ్డుబుల్లి అబ్బాయి అధ్యక్షతన జరిగింది. సమావేశంలో స్టాలిన్ మాట్లాడుతూ మహాసభవేదికపై రాష్ట్ర వ్యాప్తంగా వివిధ జిల్లాల నుంచి వచ్చే కళాకారులతో సాంస్కృతిక ప్రదర్శనలు జరుగుతాయన్నారు. ప్రజా నాట్యమండలి రాష్ట్ర ఉపాధ్యక్షుడు మహంతి లక్ష్మణరావు మాట్లాడుతూ మహాసభల ర్యాలీలో వెయ్యి మంది కళాకారులతో ప్రదర్శన ఉంటుందన్నారు. కోనసీమ జిల్లా కన్వీనర్ శామ్యూల్ తదితరులు మాట్లాడారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి రాము, గొర్రెల రాము, వీవీ శర్మ, జే.ఏసురాజు, శారద, ప్రేమానందం తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న నాయకులు

హైదరాబాద్‌లో చికిత్స పొందుతున్న మహిళకు పింఛన్ అందజేత

మండపేట, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): మండపేట-ఏడిద గ్రామానికి చెందిన గాడి లక్ష్మి అనే మహిళ హైదరాబాద్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. మూడు నెలల నుంచి ఆమె పింఛన్ తీసుకోవటం లేదు. ఆమె పింఛన్ రద్దయితే బాధిత కుటుంబానికి ఆర్థిక ఇబ్బందులు వస్తాయన్న కారణంతో 3వ సచివాలయంలో పనిచేసే సర్వేయర్ హైదరాబాద్ వెళ్లి ఆమెకు పింఛన్ అందజేశారు.



హైదరాబాద్‌లో పింఛన్ అందజేస్తున్న దృశ్యం

కానిస్టేబుల్ ఫలితాల్లో అలేఖ్య ప్రతిభ



కపిలేశ్వరపురం, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): పోలీస్ కానిస్టేబుల్ ఫలితాల్లో కపిలేశ్వరపురం గ్రామానికి చెందిన ఎస్.అలేఖ్య ప్రతిభ సాధించింది. ఓపెన్ కేటగిరీ మహిళల విభాగంలో 131 మార్కులతో 17వ స్థానం సాధించి సివిల్ కానిస్టేబుల్‌గా ఎంపికైంది. అమెను గ్రామ సర్పంచ్ సాకా శ్రీనివాస్, ఉపసర్పంచ్ బొక్కా రాంబాబు, రిటైర్డ్ టీచర్ ఎన్.అబ్బిరాజు తదితరులతో పాటు పలువురు హర్షం వ్యక్తం చేస్తూ అభినందించారు. ఆమె తండ్రి వెంకటరావు మాచర జడ్పీ ఉన్నత పాఠశాలలో ఆంగ్ల పీజీటీ గా పనిచేస్తున్నారు.

బిడ్డ ఎదుగుదలకు తల్లిపాలు దోహదం

కపిలేశ్వరపురం, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి) : తల్లిపాలు బిడ్డ ఎదుగుదలకు, వ్యాధి నిరోధక శక్తి పెరుగుదలకు దోహదం చేస్తుందని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రత్నకుమారి అన్నారు. శనివారం కపిలేశ్వరపురం కోడ్ నం. 8, కోడ్ నం. 3, 4, అంగన్‌వాడీ కేంద్రాల్లో తల్లిపాల వారోత్సవాల కార్యక్రమాన్ని నిర్వహించారు. బిడ్డ పుట్టిన 6 నెలల వరకు తల్లిపాలను అందించాలని తెలిపారు. బిడ్డపుట్టిన గంటలోపు ముర్రుపాలు పట్టాలన్నారు. ఈనెల 7వ తేదీ వరకు అంగన్‌వాడీ కేంద్రాల్లో తల్లిపాల వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమాల్లో అంగన్‌వాడీలు సుబ్బలక్ష్మి, భవాని, అంగన్‌వాడీ, ఆశా వర్కర్లు, ఏఎన్‌ఎంలు, గర్భిణీలు, తల్లులు పాల్గొన్నారు.

మణికంఠకు పలువురు అభినందనలు

ఆలమూరు, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): కానిస్టేబుల్స్ సెలక్షన్స్‌లో బడుగువానిలంకకు చెందిన పాలూరి విజయ్‌మణికంఠను ఎమ్మెల్యే బండారు సత్యానందరావుతోపాటు పలువురు నాయకులు అభినందించారు. ఆలమూరులో మణికంఠను శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో జనసేన పార్టీ కొత్తపేట నియోజకవర్గ ఇన్‌చార్జ్ బండారు శ్రీనివాస్, నాయకులు ఈదల సత్తిబాబు, ఎస్.నాగేశ్వరరావు, వంటిపల్లి సతీష్, పి.గోవిందరావు, సూరపురెడ్డి సత్య, ఈదల నల్లబాబు తదితరులు పాల్గొన్నారు.

11 ఆటోలపై కేసులు నమోదు

రావులపాలెం, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): రావులపాలెం-వాడపల్లి రహదారిపై పరిమితికి మించి ప్రయాణికులను తరలిస్తున్న 11 ఆటోలపై కేసు నమోదు చేసినట్లు రవాణాశాఖ అధికారులు తెలిపారు. రవాణా శాఖ జిల్లా అధికారి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ తనిఖీల్లో 11 ఆటోలపై కేసు నమోదు చేసి రూ.16,000 ఫైన్ విధించినట్లు వారు తెలిపారు. ప్రతి శనివారం ఈ ప్రాంతంలో తనిఖీలు నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో మోటార్ వెహికల్స్ ఇన్‌స్పెక్టర్ జ్యోతి, సురేష్, షణ్ముఖ, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేట్ ట్రావెల్ బస్సులకు ఫైన్

రికార్డులు సక్రమంగా లేని ప్రైవేట్ ట్రావెల్ బస్సులకు రవాణాశాఖ అధికారులు ఫైన్ విధించారు. రావులపాలెం జాతీయ రహదారిపై రవాణాశాఖ జిల్లా అధికారి దేవిశెట్టి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో జరిపిన ప్రత్యేక తనిఖీల్లో 17 ప్రైవేట్ బస్సులపై కేసులు నమోదు చేసి రూ.35,500 ఫైన్ విధించారు. ఈ తనిఖీల్లో ఇన్‌స్పెక్టరు రాజేంద్ర, ప్రసాద్, శ్రీనివాస్, జ్యోతి, సురేష్, లక్ష్మి, శ్రీదేవి, షణ్ముఖ, శ్రీనివాస్, కౌశిక్‌లు పాల్గొన్నారు.

త్వరితగతిన త్యాగరాజ గానసభ పూర్తి కావాలి

రామచంద్రపురం(ద్రాక్షారామ), ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): రామచంద్రపురంలో నిర్మితమవుతున్న త్యాగరాజ గానసభ త్వరలో అందుబాటులోకి రాగలదని మహామహోపాధ్యాయ దోర్బల ప్రభాకరశర్మ అన్నారు. స్థానిక రత్నంపేటలోని మహాదేవ సదన్‌లో త్యాగరాజ సంగీత సభ ఆధ్వర్యంలో జరిగిన సమావేశం వీటి వివరాలు తటవర్తి శ్రీనివాస్ విలేకరులకు తెలిపారు. సమావేశంలో ఆర్కిటెక్ బుద్దవరపు సతీష్, వ్యాపారవేత్త కొవ్వూరి తాతారెడ్డి, ఎ.శ్రీధర్, విల్లూరి కృష్ణానంద మూర్తి, ఎం.రతీమోహనరావు, బులుసు సూరిబాబు, చెరుకూరి రామ్మూర్తి తదితరులు పాల్గొన్నారు.



శనేశ్వర ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు

మందపల్లి ఆదాయం రూ.1.62 లక్షలు

కొత్తపేట, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): మందపల్లి శనేశ్వరస్వామి ఆలయానికి శనివారం భక్తులు పోటెత్తారు. వేకువజాము నుంచే స్వామివారి సర్వదర్శనాలు, తైలాభిషేకాలకు బారులుతీరారు. ఆలయ ప్రాంగణంలో భక్తజనం ప్రత్యేక పూజలు జరిపారు. వివిధ సేవల ద్వారా స్వామివారికి రూ.1,62,499 ఆదాయం వచ్చినట్లు ఆలయ సహాయ కమిషనర్లు, ఈవో డి.సురేష్‌బాబు తెలిపారు.

అథ్లెట్ ఫెడరేషన్ సెక్రటరీగా కృష్ణంరాజు

ఆత్రేయపురం, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): అథ్లెట్ వాలీబాల్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా సెక్రటరీగా తాడిపూడికి చెందిన ముదునూరి ఎంసీఆర్ కృష్ణంరాజు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా పలువురు అభినందించారు. వాలీబాల్ అథ్లెట్ల అభివృద్ధి, సంక్షేమానికి తోడ్పాటు అందిస్తానని ఆయన తెలిపారు.